29.8.1997 శుక్రవారం 10 పేజీలు సంపుటి:69 సంచిక:35 ఏడాదికి రూ.2.00లు Phone: 327354 Regd. No. HNL 18

చిరిత్రక

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి



ప్రతిపక్షం ఉనికికే ప్రమాదం!

ఎంత గింజుకున్నా, ఏ వివాదాస్పదాంశం పైనా చంద్రబాబును ఇరకాటంలో పెట్టలేక, ప్రజలలో కదలిక తేవడం చేతకాక కాంగ్రెస్, బిజెపి వంటి ప్రతిపక్షాలు భంగపడుతున్నాయి!

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిభ ఏమిటో తెలియదు గాని – రాజకీయంగా తన ప్రత్యర్థులందరినీ వరుస బెట్టి నిర్వీర్యులను చేసి పారేస్తున్నాడు. రాష్ట్రంలో ప్రతిపక్షం ఉనికిని ప్రశ్నార్థకం చేసేస్తున్నాడు.

చాలా విచిత్రంగా, విస్మయకరంగా జరిగి పోతున్నది పరిణామం. చంద్రబాబు గత జీవితాన్ని బట్టి చూస్తే – ఆయన ఉపాటికి గొంతు వరకు సంక్షోభాల వూబిలో చిక్కుక పోయి వుండాలి. స్వతహాగా నాయకత్వ లక్షణాలే లేని సగటు రాజకీయ వాది చంద్రబాబు. ఆయన ఉపన్యాసకుడు కాదు; ప్రజలను ఆకర్షించే సమ్మోహన శక్తి లేదు; రాజకీయ సిద్ధాంతాలు తెలియవు; వ్యక్తిగతంగా నిష్కళంక చరిత్ర కల్గినవాడు కాదు; పైగా ఘనత చెందిన అవినీతి చరిత్ర వుంది. రెండెకరాల ఆస్తి కల్గిన కుటుంబంలో పుట్టి రెండు వందల కోట్లకు పైగా సంపద కేపలం రాజకీయ అవినీతితోనే ఆర్జించాడన్నది అందరికీ తెలిసిన సత్యం. వీటన్నిటినీ మించి మోసపూరిత విధానంతో, విద్రోహ వైఖరితో గద్దెనెక్కాడన్న అప్రతిష్ట వుంది. పాత చరిత్రలో ఔరంగ జేబ్‌తో సరిపోల్చ దగినవాడు చంద్రబాబు. ఎన్టీఆర్‌ను మానసిక వ్యధకు గురిచేసి, మరణానికి కారకుడైన వాడిగా ఆయనపై నింద వుంది.

ఇన్ని అవలక్షణాలున్న వ్యక్తి, రాజకీయ ఎదురు గాలులలో అధికారం నిర్వహించడ మంటే మాటలు కాదు. ఇంకొక ప్రక్క చంద్రబాబు ఎదుర్కొన్నన్ని రాజకీయ, ఆర్థిక సంక్షోభాలు రాష్ట్ర చరిత్రలో మరెవ్వరికీ అనుభవంలోకి రాలేదనడం నిజం. ఆయన పదవి స్వీకరించగానే ఎన్టీఆర్ ప్రజలను రెచ్చగొట్ట డానికి ప్రయత్నించారు; రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసి జీతాలు సైతం చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది; విద్యుత్ కొరత ముమ్మరమై గాఢాంధకారం అలముకున్నది; పట్టణాలు, నగరాలలోనూ రోజుకు పది గంటల వరకు కోత విధించ వలసి వచ్చింది; అప్పులు తిరిగి చెల్లించ నందువల్ల కేంద్రం తన నిధులు విడుదల ఆపే పరిస్థితి ఏర్పడింది; విద్యుత్ ఛార్జీలు పెంచడంతో రైతులు తిరుగుబాటు చేశారు; ప్రజా ఉద్యమం పెల్లుబికింది; సబ్సిడీ బియ్యం ధర పెంచవలసి రావడంతో సాధారణ ప్రజానీకంలో అలజడి తలెత్తింది. ఇంకొక ప్రక్క మద్యపాన నిషేధం రద్దు చేయడం; దానితో మహిళలలో అశాంతి రేకెత్తింది. విద్యుత్ సంస్థ ప్రైవేటికరణ వివాదం రగులు తున్నది.

వీటన్నింటినీ మించినది – హరికృష్ణ, బాలకృష్ణ వంటి ఎన్టీఆర్ కుటుంబ సభ్యులతో పేచీ. పార్లమెంట్ ఎన్నికల సమయంలో బాలకృష్ణ సహాయ నిరాకరణ చేశారు. మాల మహానాడు, మాదిగ దండోరాల ఉద్యమాలు ఇంకొక వైపు!

రెండేళ్ల వ్యవధిలో ఇన్ని సమస్యలు, ఇన్ని సంక్షోభాలు ఎదుర్కొవలసి రావడం ఒక వింత అయితే, వాటన్నిటి నుంచి తెలివిగా, నేర్పుగా బయట పడడం ఇంకా విచిత్రం. ఎంతటి సంక్షోభంలోనూ చంద్రబాబు ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. ధైర్యంగా, ఒంటరిగా ఎదుర్కొని గెల్చాడు. సాధారణ పరిస్థితులలో వీటిలో ఏ ఒక్కటి దొరికినా – ప్రతిపక్ష నేతలు పాలక పక్షాన్ని ఉడకాడించి వుండేవి. కాని చంద్రబాబు అందుకు విరుద్ధంగా ప్రతిపక్షాలను నిర్వీర్యం చేసేశారు. వీటిలో ఏ ఒక్క సమస్యనూ ఒక రాజకీయ వివాదంగా మార్చి, ప్రజా ఉద్యమం నడపడంలో అన్ని ప్రతిపక్షాలూ విఫలమైనాయి. జనాకర్షక పథకాలతో ఓట్లు రాబట్టు కోవడానికి పార్టీలన్నీ పోటీలు పడుతున్న సమయంలో – జనానికి ఇష్టపడని, జన వ్యతిరేక మైనవిగా భావించే చర్యలు చేపట్టిన చంద్రబాబు – అందరూ ఆశ్చర్యపడే తీరులో రాష్ట్రంలో జరిగిన ప్రతి ఉప ఎన్నికలోనూ గెల్చారు. నంద్యాల, మార్కాపురం వంటి చోట్ల కాంగ్రెస్ పార్టీ కనీసం తగిన అభ్యర్థిని సైతం నిలబెట్టలేక పోయింది. డిపాజిట్లు కోల్పోయి పరువు పోగొట్టు కున్నది.

ఇప్పుడు రాష్ట్రంలో ప్రతిపక్షం అన్నది లేనట్లే లెక్క. అసెంబ్లీలో యాగీ చేయడం తప్ప, ప్రజలలోకి వచ్చి, ప్రభుత్వ వ్యతిరేకతను ప్రేరేపించి, ఉద్యమాలు నిర్మించగల సత్తా వున్న నాయకులే కరువైనారు.

ఈ పరిణామానికి కారణం – పత్రికలు నిర్వహించిన పాత్ర అనడం నిజం. రాష్ట్రంలోని అన్ని ప్రధాన దిన పత్రికలూ – బేషరతుగా చంద్రబాబు కొలువులో పూడిగం చేస్తున్నాయి. ప్రభుత్వంపైన ఒక్క నింద పడకుండా, పడిన నిందలు ప్రజల దృష్టిలో పడకుండా రక్షణ కవచం నిర్మించాయి పత్రికలు. పత్రికా యాజమాన్యాలతో స్నేహ సౌహార్ద బాంధవ్యం నెరపడం ద్వారా చంద్రబాబు తన వ్యతిరేక ప్రచారం జరగకుండా కాపాడు కొంటున్నారు. కేంద్రంలో ఆయనకున్న పలుకుబడి దృష్ట్యా టివి సైతం చంద్రబాకా వూదుతూంది. అదే ఆయన అదృష్టాలలో కెల్లా ఉత్తమమైన భాగ్యం.

అయితే ఇప్పుడున్నా నిర్వీవత్వంతోనే మరికొంత కాలం నడిస్తే కాంగ్రెస్, బిజెపి పార్టీలు రేపటి అసెంబ్లీ ఎన్నికల నాటికి ఏ దుస్థితికి చేరుకొంటాయో నన్నది సందేహం. లక్ష్మీపార్వతి తెలుగు దేశం ఎప్పుడో తెరమరుగై పోయింది. సిపిఎం, సిపిఐలు చంద్రబాబు భజనలో మునిగి తేలుతున్నాయి. వాటి ఉనికి ఎప్పుడో అంతరించింది. కాంగ్రెస్, బిజెపిలు సైతం తమ అస్తిత్వం కోల్పోతే రాష్ట్రంలో రాజకీయ నిరామయ పరిస్థితి ఏర్పడుతుంది. కాని ఆ ప్రమాదాన్ని కాంగ్రెస్ వాదులు గుర్తించడం లేదు. తమలో తాము తన్నుకోవడానికే వారికి సమయం చాలడం లేదు; ఇక చంద్రబాబును వారెమి ఎదుర్కొంటారు!

సింహపురి స్వర్ణజయంతి చరిత్ర సృష్టించేట్లుంది!

సీతారాం కేసరి ఆగమనంతో సాదా ఉత్సవం ఘనతర ప్రదర్శనగా రూపుదాల్చింది; రాజీవ్ గాంధీ విగ్రహానికీ మోక్షం లభిస్తున్నది!

నెల్లూరు జిల్లాలో కాంగ్రెస్‌కు మంచి రోజులు వచ్చేట్లున్నాయి; దశ తిరిగి నట్లుంది. స్వాతంత్ర్య స్వర్ణోత్సవాలు ఘనంగా జరపాలని మాజీ ముఖ్యమంత్రి శ్రీ ఎన్. జనార్దన రెడ్డిలో కలిగిన చిన్న సంకల్పం అంతై, పటుడింతై, నభోరాశియంతైవట్లు పెరిగి పెరిగి విశ్వరూపం ధరించింది. సెప్టెంబర్ రెండవ వారంలో జరప దలచిన ఈ స్వర్ణోత్సవాలకు జరుగుతున్న ప్రణాళిక నెల్లూరులో ఇదివరకెప్పుడూ ఏ సభ జరగని తీరును తలపింప జేయబోతూంది. ముందు ఇందిరా భవన్‌లో లాంఛనంగా జరిపించ తలపెట్టారీ ఉత్సవం. తర్వాత కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ అనుకున్నారు; ఆ పిమ్మట వీఆర్ హైస్కూలు మైదానంలోకి తరలింది. జిల్లాస్థాయి నాయకులతో సరిపెట్ట వలసిన సభ, ఏసి అధ్యక్షుడ్ని ఏలిస్తే బాగుండునేమోకాని, ఇప్పుడు ఏకంగా ఎఐసిసి అధ్యక్షుడు సీతారాం కేసరి సమక్షంలో జరగబోతూంది. ఆయన మధ్యాహ్నం 3 గంటలకు ఆత్మకూరు బస్టాండు దగ్గర పొట్టి శ్రీరాములు బొమ్మ నుంచి ప్రదర్శన. రిపబ్లిక్ డే పెరేడ్‌ను తలపించే తీరులో దీన్ని నిర్వహించ డానికి ప్రయత్నిస్తున్నారు. స్వాతంత్రోద్యమ ఘట్టాలను తలపింపజేసే వివిధ చారిత్రక సంఘటనలు, ప్రదేశాలను స్ఫురింపజేస్తూ శకటాలు నడిపిస్తారు. జిల్లా, మహిళ, యూత్, సేవాదళ్, ఎస్సీ, ఎస్టీ, ఎన్ఎస్‌యుఐ వంటి కాంగ్రెస్ అనుబంధ సంస్థల వారందరూ విడివిడిగా ప్రదర్శనలో నడుస్తారు. ఏ ఇండలానికా మండలం ఏదో ఒక ప్రత్యేకతతో ప్రదర్శనలో పాల్గొంటాయి. పండరి భజన, కోలాటం, గిరిడీలు, కేసరిని వరించింది.

తనంతట తానుగా నెల్లూరును రావడానికి ఉత్సాహం చూపించాడట. కాంగ్రెస్‌కు మంచి రోజులు రాబట్టి సీతారాం కేసరిలో ఆ సంకల్పం కల్గి వుంటుంది.

ఉత్సవ నిర్వహణకు పకర్బందీ ప్రయత్నాలు జరుగు తున్నాయి. కావలి ఎమ్మెల్యే కలికి యానాదిరెడ్డి, ఉదయగిరి మేకపాటి గౌతమ్‌రెడ్డి తప్ప తతిమా జిల్లా కాంగ్రెస్ వాదులందరూ ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఆ రోజంతా నెల్లూరులో పండుగే. ఉదయం ఇందిరా భవన్‌లో రాట్నం పడికి పోటీలు, వ్యాసరచన పోటీలు జరుగుతాయి. గుర్రాలు, ఏనుగులు, ఒంటెలు నడుస్తాయి. 50 జత కాడెద్దులు అలంకరణతో సాగుతాయి.

స్వాతంత్ర్య సమర యోధుల, వివిధ రంగాలలో నిష్ణాతులైన వారికి సన్మానాలు చేస్తారు. స్వాతంత్ర్యోద్యమాన్ని స్ఫురింపజేసే పాటలు, పద్యాలు పాడుతారు.

అది రోజు ఎసి స్టేడియం దగ్గర రాజీవ్ గాంధీ విగ్రహం ప్రతిష్టిస్తారు – సీతారాం కేసరి. పివి చేతుల మీదుగా జరగవలసిన కార్యమిది; ఆ అదృష్టం

ఈ ఉత్సవానికి సన్నాహంగా జిల్లా ఆధ్వర్యంలో ఇందిరా భవన్‌లో, మునిసిపల్ ఛైర్మన్ వివేకానంద రెడ్డి నేతృత్వంలో కార్పొరేషన్ పరిధిలో జరిగిన కార్యకర్తల సభలు దిగ్విజయ మైనాయి. ఆ ఉత్సాహం చూస్తే చాలు – రేపటి స్వర్ణోత్సవ సంబరం ఎంత సంరంభంగా జరగబోయేదీ వూహించవచ్చు.

చాన్నాళ్ల తర్వాత ఒక మంచి పని తలపెట్టింది జిల్లా కమిటీ! అది దిగ్విజయం చెందాలని ఆశిద్దాం!

డాక్టరకు బాడుగకు

నెల్లూరు టౌన్, రామచంద్రా రెడ్డి హాస్పిటల్ ఎదురుగా, డాక్టర్ జి. కొండారెడ్డి గారి క్లినిక్ మిద్దె పైన డాక్టర్స్ క్లినిక్‌కు అనుకూలమైనది బాడుగకు ఇవ్వబడును. వివరాలకు

ఫోన్: 327235

పైర్లు, బ్యాటరీల ధరలు సగానికి తగ్గిపోతాయి!

దేశంలో పైర్ల ధరలు ఒక్కసారిగా పాతిక పంతు వరకు తగ్గిపోయాయి. విదేశీపైర్ల దిగుమతికి ప్రభుత్వం అనుమతించడమే దీనికి కారణం. ప్రపంచ ప్రసిద్ధి చెందిన బ్రిడ్జి స్టోన్, పిరెల్లి, మెక్‌లిన్, కుంబో వంటి బ్రాండ్ల పైర్లు ఇప్పుడు దేశంలో చాలా చవక ధరలకు లభిస్తున్నాయి.

స్వదేశీ పైర్ల పరిశ్రమకు అశనిపాతం వంటి పరిణామం ఇది. భారతీయ బ్రాండ్లు తుపోటిని, ధరలను తట్టుకోవడం చాలా కష్టం. విధిలేని పరిస్థితులలో వీరు ధరలు తగ్గిస్తున్నారు. జెకె అల్లిమా పైర్ ధరను రు1700ల నుంచి రు1200లకు; సియట్ మేస్ట్రో, గుడ్‌ఇయర్ జిపిఎస్ పైర్ల ధరలు రు1750ల నుంచి రు 1500లకు తగ్గించారు. రేడియల్ పైర్ల ధరలూ పడిపోతున్నాయి. వీటి ఫలితంగా ఆయా కంపెనీల షేర్లూ క్షీణించి పోతున్నాయి. చాలా పరిశ్రమలు వ్యాపారం లేక మూతపడినా ఆశ్చర్యం లేదు.

***

పైర్ల వలెనే, విదేశీ బ్యాటరీలనూ స్వేచ్ఛగా అనుమతించింది ప్రభుత్వం. జపాన్, అమెరికాలలో తయారయ్యే కారు, లారీ, ట్రాక్టర్ల బ్యాటరీలు త్వరలో ఇండియాకు రానున్నాయి. బ్యాటరీల తయారీలో జపాన్ ప్రసిద్ధి చెందింది. వారు చాలా తక్కువ ధరకు, ఎంతో నాణ్యత కల్గిన బ్యాటరీలు తయారు చేస్తారు. ఆ ధరలో, అదే నాణ్యతలో తమ ఉత్పత్తులు తయారు చేసుకొనే సామర్థ్యం

విదేశీ ఉత్పత్తుల ధాటికి స్వదేశీ కంపెనీల బేజారు

పెంచుకొనే వరకు భారతీయ బ్యాటరీ పరిశ్రమలు సంక్షోభం ఎదుర్కోక తప్పదు. ఇండియాలో రు2200ల ధరలో అమ్మే బ్యాటరీలను జపనీయులు రు1000లకు ఇక్కడ అమ్మగలరు. ప్రపంచ మార్కెట్‌లో వీటి ధర కేవలం 25 నుంచి 30 డాలర్లు మాత్రమే. ఈ ధరకు మన కంపెనీలు బ్యాటరీలు అమ్మడం అసాధ్యం. ఆ పరిశ్రమలన్నీ గందరగోళంలో పడిపోతాయి. అమ్మకాలు తగ్గి, వ్యాపారం స్తంభించి, ఉద్యోగులకు ముప్పు ఏర్పడుతుంది.

పైర్లు, బ్యాటరీ కంపెనీల షేర్లకు పతనం తప్ప పెరగడం వుండదు. వాటిని వీలైనంత త్వరగా వదిలించుకోవడం మేలు.

హీరోహోండా షేర్ మంచి జోరులో వుంది!

గిరాకీ, అమ్మకాలు క్షీణించి ఆటోమొబైల్ పరిశ్రమ అతలాకుతలం అవుతున్నప్పటికీ, హీరోహోండా కంపెనీ షేర్ మాత్రం ఉజ్వలంగా వెలుగొందుతూంది. దీని ధర పెరగడమే తప్ప, తగ్గడం లేదు. అదీ వూహించని అభివృద్ధి! ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్ట్ మధ్య ఏడు నెలల వ్యవధిలో దాదాపు 3 రెట్లు రెట్టింపైంది ఈ షేర్! జనవరిలో 260; ఫిబ్రవరిలో 300;

కొరవ 6 పేజీలో



డాక్టర్ భైరవరను త్రివిక్రమరావు రచించిన గృహమోపతి గ్రంథాన్ని ఈనెల 16 తేది మద్రాసులో ఆవిష్కరిస్తున్న కెనివి లిమిటెడ్ ఎగ్జిక్యుటివ్ డైరక్టర్ వియల్. ఇందిరాదత్

బంగారం ధర పెరగదు, తరగదు!

భారతదేశంలో బంగారానికి డిమాండ్ మరొకసారి పెరగడం ప్రారంభించింది. గత మూడు నెలల్లో (ఏప్రిల్, మే, జూన్) 185 టన్నుల బంగారం అమ్మగలిగారు. జనవరి, ఫిబ్రవరి, మార్చిలలో అమ్మకాల పరిమాణం 163 టన్నులు. ఈ కాలంలో దేశంలోకి అధికారికంగా 250 టన్నుల బంగారు దిగుమతి అయ్యింది.

బంగారానికి డిమాండ్ పెరగడానికి ప్రధానం కారణం - ధర తగ్గడం. ఈ క్షీణత వల్ల అంతర్జాతీయ మార్కెట్‌కు, మన మార్కెట్‌కు గల ధర వ్యత్యాసం కేవలం 15 శాతానికి వచ్చేసింది. చాలా బ్యాంకులు స్పెషల్ ఇంపోర్ట్ లైసెన్సుతో బంగారం తెచ్చుకొంటున్నాయి. ఎన్ఆర్ఐలు ఇప్పుడు స్వదేశం తిరిగి వచ్చేటప్పుడు 10 కిలోల వరకు తెచ్చుకోవడాన్ని అనుమతిస్తున్నారు. వీటన్నింటివల్లా, దేశంలో బంగారం ధర తగ్గిపోతూ వుంది. డిమాండ్ ఎంత పెరిగినప్పటికీ ధర పెరిగే అవకాశం లేదు. ఈ ఏడాది పూర్తిగా ఒక వంద లేదా రెండు వందల టన్నులతో ఇప్పటి ధరలోనే నుండిపోతుంది.

ఢిల్లీ ఎక్ఛేంజికి కూడా ఆన్‌లైన్ టెర్మినల్
నేషనల్ స్టాక్ ఎక్ఛేంజి మాదిరి ఢిల్లీ స్టాక్ ఎక్ఛేంజి కూడా దేశమంతటా సెటిలైట్ టెర్మినల్స్ ఏర్పాటు చేయబోతూంది. అన్ని నగరాలలో వీటిని నెలకొల్పుతారు. ఇప్పటి వరకు నేషనల్ స్టాక్ ఎక్ఛేంజి ఈ ప్రకారం ఏర్పాటు చేసింది. దేశంలోని అన్ని జిల్లా కేంద్రాలలో వీరికి టెర్మినల్స్ వున్నాయి. నెల్లూరులో కూడా పినాకిని పేర్ల

షేర్‌కాలం
డాక్టర్ ఎ. దుర్గాప్రసాద్

పేరుతో జివికె గ్రూప్ వారు ఒక టెర్మినల్ నిర్వహిస్తున్నారు. త్వరలో మద్రాసుకు చెందిన కొందరు వ్యాపారులు రెండవ టెర్మినల్ స్థాపించబోతున్నారు. ఇప్పుడిదే తరహాను ఢిల్లీ ఎక్ఛేంజి అనుసరిస్తున్నది. వీరి మొదటి టెర్మినల్ మద్రాసులో పెడతారట.

ఎన్ఎస్ఇ, ఢిల్లీ టెర్మినల్స్ రెండూ ఒకేచోట వుంటే సమాంతర ట్రేడింగ్‌తో చిన్న ఇన్వెస్టర్లు లాభపడే అవకాశం వుంది. పైగా ఢిల్లీ వారు కెనరాబ్యాంక్‌తో ట్రేడ్ గ్యారంటీ ఫండ్ అగ్రిమెంట్ చేసుకొన్నారు. ఈ ఒప్పందం వల్ల ప్రధాన 'ఎ' గ్రూప్ షేర్లు, 'బి' గ్రూప్ షేర్లలో డిమాండ్, సరఫరాలను బట్టి ట్రేడింగ్ అభివృద్ధి చెందే అవకాశం వుంది.

చైనా తారాపథంలోకి వెళ్తుంటే భారత్ పాతాళంలోనే వుంది!

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చైనాదేశం అత్యంత వేగంగా సుస్థిర స్థానం ఆక్రమించు కొంటున్నది. విస్తీర్ణం, జనాభా, చరిత్ర తదితర విషయాలలో చైనాతో సమ స్థానం కల్గిన భారతదేశం మాత్రం ఆర్థిక రంగంలో స్తబ్ధతను వీడలేకున్నది.

ఈ ఏడాది చైనా ప్రపంచ ఎగుమతి వాణిజ్యంలో 2.7 శాతం వాటా సాధించగల్గింది. ఇది అద్భుత విజయం. మన దేశం మాత్రం కేవలం 0.6 శాతం వాటాతో తృప్తి పడవలసి వస్తున్నది. రెడీమేడ్ దుస్తుల ఎగుమతులలో చైనాదిప్పుడు ప్రథమ స్థానం; సాధారణ వస్త్రాల ఎగుమతిలో రెండవస్థానం; రసాయనాలలో 12 స్థానం. ప్రపంచమంతటా 220 దేశాలతో చైనా తన వాణిజ్య సంబంధాలు మెరుగుపరుచు కోగల్గింది. జపాన్‌లో అత్యధిక వ్యాపారం చేసేది చైనానే! గత ఐదేళ్లలో వారి ప్రగతి సాధించారు. 1992లో వారి విదేశీ నిధుల నిల్వలు కేవలం 21 బిలియన్ డాలర్లు; ఇప్పుడది 110 బిలియన్ డాలర్లకు పెరిగింది. మన నిల్వల మొత్తం కేవలం 30 బిలియన్ డాలర్లు మాత్రమే. ఈ నిల్వల వల్ల తాము విదేశాల నుంచి, ఐఎంఎఫ్ నుంచి తెచ్చుకొన్న అప్పులు, వడ్డీలు చాలా వరకు చెల్లించివేశారు చైనీయులు.

ఆర్థిక రంగంతోపాటు, సామాజికంగా కూడా మంచి ప్రగతి సాధించారు వారు. వారి జనాభా పెరుగుదల శాతం బాగా తగ్గిపోయింది. ఇప్పుడున్న 105 కోట్ల జనం రెట్టింపు కావాలంటే ఇప్పటి పెరుగుదల శాతం ప్రకారం వారికి 85 సంవత్సరాలు పడుతుంది. కాని గత యాభై ఏళ్లలో భారత జనాభా 30 నుంచి 90 కోట్లకు - అంటే మూడురెట్లు పెరిగిపోయింది. ఇప్పటి మన జనాభా పెరుగుదల శాతం ప్రకారం రానున్న 50 ఏళ్లలోనే

కొరవ 6 పేజీలో

రేషన్ షాపుల అక్రమాలకు కూపన్లతో బ్రేక్ వేయవచ్చు!

రేషన్ షాపుల విషయంలో లంచాలు, మోసాలు, బ్లాక్‌మార్కెట్, అధికార్ల అక్రమాలు తదితరాలపై తరచు పత్రికలలో వార్తలు కన్పిస్తూనే వుంటాయి. ఇదొక నిరంతరాయ దోపిడీ. స్వాతంత్ర్యం రాకముందు నుంచీ మన దేశంలో రేషన్ విధానం అక్రమ వ్యాపారుల పాలిట స్వర్గంగా చలామణీ అవుతూవుంది. కోటాల కేటాయింపులో అధికారులు, పంపిణీలో వ్యాపారులు ఎప్పుడూ దోబీ చేస్తూనే వుంటారు. ఎన్ని విచారణలు జరిగినా, ఎందరు అధికారులు పచ్చినా, ఎన్ని కేసులు నడచినా పరిస్థితి అంతే; మార్పు వుండదు. అంటే రేషన్ వస్తువుల పంపిణీ వ్యవస్థలోనే మోసం వుంది. వ్యవస్థను సంస్కరించకుండా, వ్యక్తులను శిక్షిస్తే ఫలితం శూన్యం; జరిగిన తప్పులు జరుగుతూనే వుంటాయి.

ఈ విషయంలో రష్యా, ఇరాన్ వంటి దేశాలు అనుసరించే పద్ధతి మనకు తగినదిగా కన్పిస్తూంది. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో, 1943 ప్రాంతంలో రష్యాలో రేషన్ విధానం అమలులోకి వచ్చింది. ఇరాక్‌తో యుద్ధం సమయంలో ఇరాన్ దేశం 1980 ప్రాంతంలో రష్యా పద్ధతినే కొద్ది మార్పులతో ప్రవేశపెట్టింది. అక్కడ ఇప్పటికీ అదే పద్ధతి కొనసాగుతూంది.

మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటివల రేషన్ వ్యవస్థను

చంద్రబాబుకు ఒక సూచన!

సంస్కరించాలనే ప్రయత్నం చేస్తున్నారు. అటువంటి ప్రయత్నానికి ఇరాన్ వ్యవస్థ అధ్యయనం చాలా ఉపకరిస్తుంది. ఇరాన్‌లో వున్నప్పుడు నేనా పద్ధతిని చాలా నిశితంగా పరిశీలించాను.

ఈ పద్ధతి ప్రకారం ప్రభుత్వం దేశంలోని పౌరులందరినీ బ్యాంకుల ద్వారా రికార్డు చేసి, ఐడెంటిటీ కార్డులు జారీ చేస్తుంది. ఆయా కుటుంబాల ఆర్థిక పరిస్థితిని బ్యాంకులు నిర్ణయిస్తాయి. దాని ప్రకారం ప్రభుత్వం ప్రజలకు రేషన్ కూపన్లు జారీ చేస్తుంది. ఇవి సంవత్సరానికి ఒకే పర్యాయం ఇచ్చేస్తారు. ఇంటి యజమాని ఆర్థిక స్థితి, ఇంటిలోని సభ్యుల సంఖ్య, ఆడ మగ పిల్లల వివరాలు ఆ కూపన్ పైనే సమగ్రంగా వివరించి వుంటాయి. కూపన్ ప్రింట్ చేసి, పంపిణీ చేయడానికయ్యే ఖర్చు ప్రజల నుంచే వసూలు చేస్తారు.

రేషన్ పంపిణీకి ప్రత్యేకంగా షాపులు వుండవు. సాధారణ కిరాణా షాపులలోనే రేషన్ సామాన్లు లభ్యమౌతాయి. కిరోసిన్‌కు మాత్రం ప్రత్యేక అంగళ్లు వుంటాయి. కూపన్‌లున్న వారికి ఏవి వస్తువులు, ఏ ధరలకు అమ్మాలో ప్రభుత్వం నిర్ణయిస్తుంది. మార్కెట్‌లో ఆయా వస్తువుల లభ్యత వుందని ధృవపడగానే ప్రభుత్వం రేడియో, టివి ప్రకటనల ద్వారా రేషన్ వస్తువులు తెచ్చుకోవచ్చునని ప్రకటిస్తుంది. సాధారణంగా వస్తువులు తెచ్చుకోవడానికి 3 నెలల వ్యవధి

కొరవ 6 పేజీలో

అవినీతిపై పోరు

దేశంలో అవినీతిపై సమరం ప్రారంభించాలని ప్రధాని ఐకె గుజ్రాల్ పిలుపు ఇచ్చారు. ప్రధాన మంత్రి స్థాయిలోని నేత పరిపాలనా యంత్రాంగంలో అవినీతిని అంగీకరించడం ఇప్పటికొన్నే సార్లు జరిగింది. రెండు దశాబ్దాల క్రితమే స్వర్గీయ ఇందిరా గాంధీ అవినీతి అనేది విశ్వవ్యాప్త జాడ్యం అని అభివర్ణించింది. విపి సింగ్ – ఉన్నత స్థాయిలో అవినీతిపై సమరం చేయాలనే నినాదంతో ప్రజలను ఆకర్షించి, గద్దెనెక్కారు; మరొక మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ – కేంద్ర ప్రభుత్వం వ్యయం చేసే ప్రతి రూపాయిలో కేవలం 6 పైసలు మాత్రమే గ్రామాలకు చేరుతున్నదని, తతిమా 94 పైసలూ వివిధ స్థాయిలలో దుబారా లేదా దుర్వినియోగం అవుతున్నాయని ప్రకటించారు; ఆయనా అవినీతిపై యుద్ధం చేయాలని కోరినవారే!

ప్రధాన మంత్రి అంటే ప్రభుత్వాధి నేత. దేశం యావత్తులో పరిపాలన ప్రధాని బాధ్యత. మంచైనా, చెడైనా స్వీకరించ వలసిందే. కాని విచిత్రంగా ఏ ప్రధాన మంత్రి కూడా తమ పరిపాలనలో అవినీతికి బాధ్యత తీసుకోవడం లేదు. దాని దగ్గరకు వచ్చేటప్పటికి వేదాంతం వల్లిస్తారు; కావంటే వేదికలెక్కి ఆవర్నాలు వల్లివేస్తారు. దాన్ని నిర్మూలించ డానికి తగిన చర్యలు చేపట్టక పోవడం ఆటుంచండి, కనీసం – తమ స్థాయిలో కఠిన నియమాలు పాటించడమూ జరగడం లేదు.

ఐకె గుజ్రాల్ సంగతే తీసుకొందాం. అవినీతిపై అనునిత్యం ఉపన్యాసాలు దంచే ఈ పెద్ద మనిషి – అవినీతి పరుడైన లాలూప్రసాద్ యాదవ్‌పై చర్య తీసుకోవలసి వచ్చేటప్పటికి ముఖం చాటేశారు. పలురకాల అవినీతి ఆరోపణలపై దర్యాప్తు జరుపుతున్న సిబిఐ డైరక్టరును – ఆ అవినీతి పరుల ప్రీత్యర్థం పదవి నుంచి తప్పించారు. అక్కడికి వచ్చేసరికి ఆయనకు తన పదవి, తన రాజకీయ భవితవ్యం, అవసరం అడ్డు వచ్చాయి. ఆయనలో నిజాయితీ వుంటే తన పదవికి ప్రమాదం ఏర్పడు తుందని తెలిసినా ధైర్యంగా నిర్ణయాలు తీసుకొని వుండాలి. తాను మాత్రం అవినీతి పరుల అండతో, వారికి తాను రక్షణ కవచంగా నిల్చి – తన పదవి పరిరక్షించు కోవాలి; ప్రజలు మాత్రం అవినీతిపై పోరు సల్పాలనేది ఆయన మాటల సారాంశం. ఎంత హాస్యాస్పదమైన వాదం ఇది?

దేశ పరిపాలనలో అవినీతి చెద పురుగు అణువణువునా వ్యాపించి వుంది. దాని వేళ్ళు లోలోపలకు చొచ్చుక పోయి వున్నాయి. పోలీసు కానిస్టేబిల్ నుంచి సిబిఐ డైరక్టర్ వరకు; వార్డు కౌన్సిలర్ నుంచి దేశ ప్రధాని వరకు; తాలూకాఫీసు గుమాస్తా నుంచి క్యాబినెట్ సెక్రటరీ వరకు అవినీతికి అలవాటు పడిపోయి వున్నారు. అది ఆయా వ్యక్తుల జీవితంలో ఒక భాగంగా మారిపోయి వుంది. చాలా సందర్భాలలో దాన్ని తప్పుగా భావించని పరిస్థితులు ఏర్పడి వున్నాయి. కేవలం ఉపన్యాసాలతో, చట్టాలతో, పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలతో ఈ భూతం మనల్ని వదలి వెళ్లదు. ప్రజల ఆలోచనా వైఖరిలో, పరిపాలనా వ్యవస్థలో సమూల మార్పులు వస్తే తప్ప దాన్ని నిర్మూలించడం అసాధ్యం. అవినీతి పరుడైన రాజకీయ వాదిని ప్రజలు అసహ్యించుకొనే రోజు, లంచాలు మరగిన అధికారిని సంఘం నుంచి వెలివేసే రోజు వస్తే తప్ప ఈ యుద్ధం ప్రారంభం కాదు.

అసలు అవినీతికి నిర్వచనమే సక్రమంగా లేదు మన వ్యవస్థలో! ఒక శాసన సభ్యుడు ఎన్నికలలో గెలవాలంటే చట్టం ప్రకారం కేవలం లక్ష 75 వేల రూపాయలు ఖర్చు చేయాలి. అంతకు మించి పైసా వ్యయం చేసినా అది చట్ట విరుద్ధం. అవినీతితో సమానం. కాని – అసెంబ్లీ ఎన్నికలలో గెలవాలంటే అధమ పక్షం పది లక్షలకు తక్కువ ఖర్చు సరిపోదని అందరికీ తెలుసు. పార్లమెంట్ సభ్యుడికైతే కనీసం 50 లక్షలు కావాలి. దీని అర్థం – ఎన్నికైన ప్రతి ప్రజా ప్రతినిధి, ప్రతి మంత్రి, సాక్షాత్తు ప్రధాన మంత్రితో సహా అవినీతికర మార్గాలలో గెల్చినట్లే లెక్క. చట్టం అనుమతించిన మొత్తం కంటే అధికంగా చేసిన ప్రతి పైసా వ్యయమూ వారి అవినీతికి నిదర్శనమే. ఈ అదనపు వ్యయం వారు వ్యాపారుల నుంచి అక్రమంగా, చట్ట వ్యతిరేకంగా నిరాళాల రూపంలో దండినదే! ఒక నాయకుడికి ఒక వ్యాపారి విరాళం ఇచ్చాడంటే – అంతకు అంత తనకు ప్రయోజనం ఆశించే ఇస్తాడు. ఆ ప్రయోజనం చేకూర్చాలంటే తిరిగి ఆ నాయకుడు తాను పదవిలోకి రాగానే చట్ట వ్యతిరేక పనులకు పాల్పడి చేకూర్చి పెట్ట వలసిందే; ఆ పనులు చేయవలసింది అధికార్లు. నేతల పురమాయింపుతో చట్టాన్ని ధిక్కరించే అధికారి, దానితో పాటుగా తన స్వార్థమూ చూసుకోవడం సహజం. ఇదంతా ఒక విషవలయం. ఈ వలయంలోని ప్రతి లింకూ అవినీతి స్పర్శ తగిలినదే. నీతిని స్థాపించాలంటే ఆ వలయాన్ని సమస్తం సంస్కరించా ల్సిందే తప్ప, ఒకటి రెండు లింకులను దండిస్తే ఏమీ జరగదు.

రాజకీయ నాయకులు ప్రథమంగా వీటికి కట్టుబడి వుండడం ఈ సమస్యకు పరిష్కారం. కాని దురదృష్టవశాత్తు వీటికి విలువది, నిజాయితీగా పనిచే ప్రభుత్వాలు సంఘం దృష్టిలో అసమర్థులుగా పరిగణింప బడుతున్నారు. వారికి కష్టాలు తప్ప మరేవీ లభించవు. వారికి ఏ పార్టీ టిక్కెట్ ఇవ్వరు; ఇచ్చినా ప్రజలు ఓట్లు వేయరు; స్వతంత్రంగా నిలబడితే డిపాజిట్లు సైతం రావు. అవినీతితో కోట్లు గడించి, ఎన్నికలలో లక్షలు వెదజల్లే నేతల వైపే జనం గొర్రెల మందల పరి ఆకర్షింప బడతారు. వారి దర్పం, ఘనతలను వీధుల్లో కొనియాడతారు. వారికి బ్రహ్మరథం పడతారు. ఆ క్షణంలో వారికా డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందన్న స్పృహ వుండదు. అందువల్లనే అవినీతి పరులు అందలమెక్క గల్గుతున్నారు. ప్రజల ఆలోచనల్లో మార్పు రానంత వరకు నేతలు మారరు; నేతలు మారనంత వరకు అధికారులు తమ అక్రమాలు ఆపరు; అధికారి అక్రమంగా తప్ప సక్రమంగా పనులు చేయనందువల్ల ప్రజలు లంచాలు చెల్లించడం మానుకోరు! ఇదీ నేటి దుస్థితి! దీన్ని సంస్కరించడం ఎవరి తరం?

జమీన్‌రైతు
29.8.47
పేజీలు:10 వెల:0-2-0

శ్రీ కస్తూరిదేవి విద్యాలయం – నాట్య ప్రదర్శన

శ్రీ కస్తూరి దేవి విద్యాలయ సహాయార్థం జరుగు భరత నాట్య ప్రదర్శన కార్యనిర్వాహక వర్గానికై శ్రీ పైడా సుబ్బరామయ్య గారిని అధ్యక్షుడుగా, శ్రీ ఆనం వెంచు సుబ్బారెడ్డి, శ్రీ మరుపూరు కోదండ రామరెడ్డి గార్లను కార్యదర్శులుగా, శ్రీ పత్తి శేషాచలం శెట్టి గారిని కోశాధికారిగా ఆగస్టు 23వ తేది "జమీన్ రైతు" కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎన్నుకోవడమైనది. సభ్యులు శ్రీ పెనుబోలు సుబ్బయ్య శెట్టి, శ్రీ వివి సుబ్బయ్య శెట్టి, శ్రీ చల్లా పిచ్చయ్య, శ్రీ యతిరాజం రామమూర్తి, శ్రీ దొంతంశెట్టి కన్నయ్య శెట్టి, శ్రీ దువ్వూరు సుబ్రహ్మణ్యం, శ్రీ గుండాల వెంకట సుబ్బారెడ్డి, శ్రీ చుండూరు రమణయ్య శెట్టి, శ్రీ పన్నపురెడ్డి కృష్ణారెడ్డి, శ్రీ నెల్లూరు వెంకట్రామా నాయుడు, శ్రీ కాసుకోల రామారావు గార్లు. పై భరత నాట్య ప్రదర్శనకు అందరు సాయపడి శ్రీ కస్తూరి దేవి విద్యాలయాభివృద్ధికి తోడ్పడండి – శ్రీ కస్తూరి దేవి విద్యాలయ కమిటీ.

బ్రిటీషు ప్రభుత్వం ఇండియాకు వెయ్యికోట్ల రూపాయలు బాకీ

బ్రిటన్ దివాలా తీయలేదండి; డాలర్ చిక్కు వచ్చింది. ఆ దేశానికి లోకుల సొమ్ము విరివిగా మంచి బెల్లం కంటె తీపిగా వుంది. సొంతానికి భర్తవు తుండగా ప్రాణానికి హాయిగా ఉండేది.

భారత దేశం మీద ఉన్న అప్పు, లేని అప్పు రుద్ది ప్రథమ ప్రపంచ సంగ్రామా నంతరం మనం ఇంగ్లాండుకు వెయ్యికోట్ల రూపాయలు రుణపడి వున్నట్లు దొరలు లెక్కగట్టినారు; ఇవి దొంగ లెక్కలని, అంత సొమ్ము మనం నిజంగా బాకీ

50 ఏళ్ళ క్రితం ఈ వారం

పడలేదని కుమారప్ప, పట్టాభి, శెటి షా ప్రభృతు లంతా తెలిపినారు. అయినప్పటికీ బ్రిటిషు ప్రభుత్వం వెయ్యికోట్ల రూపాయల అప్పును మన నెత్తిన రుద్దింది. ద్వితీయ ప్రపంచ సంగ్రామా నంతరం ఆ దొంగ లెక్కల ప్రకారం పేరిన మన రుణం చెల్లుపోగా, బ్రిటిషు ప్రభుత్వం మనకు దాదాపు వెయ్యి కోట్ల రూపాయలు బాకీ పడింది.

అవి – ఇవి

పాపం! రాచపూడి రామలింగం శెట్టి గారు కూడా తమ తిరుదానికి తీలోదకా లిచ్చినారు.

కొరవ 8 పేటిలో

భారతీయ స్త్రీని మాత్రం సమస్యల చెర వీడలేదు!

భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 50 ఏళ్లయినా దేశంలోని మహిళల స్థితిగతులు మారలేదు. ఎక్కడి సమస్యలు అక్కడే వున్నాయి. పదేళ్ల వయస్సు నుంచే లైంగిక అత్యాచారాలు, పెళ్లి వయస్సు వచ్చాక వరకట్న వేధింపులు, హత్యలు, ఆత్మహత్యలు జరిగి పోతూనే వున్నాయి. ప్రభుత్వ చట్టాలు చట్టుబండ లవడం మినహా మహిళలకు ఏ విధంగానూ ఉపయోగ పడడం లేదు. ప్రసార సాధనాల్లో దిక్కుమాలిన ప్రదర్శనలు, అందాల పోటీలు, మహిళను అశ్లీల సంస్కృతి వైపు లాక్కొంటూ వ్యాపార వస్తువుగా మారుస్తున్నాయి. మహిళలపై అత్యాచారానికి పాల్పడి ఆమెను సంఘంలో తలెత్తు కోనీయకుండా చేస్తున్న వ్యక్తులకు భారత దేశంలో సరియైన శిక్షలు పడడం లేదు. చట్టసభల్లో మహిళలు 30 శాతం మంది ప్రవేశిస్తే ఎక్కడ తమ ఆధిక్యత దెబ్బ తింటుందోనని మహిళా బిల్లును పార్లమెంటులో ఆమోదించని పురుష పుంగవులున్న ఈ దేశంలో స్త్రీ ఎలా నిలదొక్కుకో గలదు?

నెల్లూరు కె. లక్ష్మీప్రసూన

అనావృష్టి పరిస్థితులు

తెలుగు పాఠం చెప్తే నోట్సు అవసరం ఏర్పడేది కాదు. మళ్లీ పుస్తకం చదవాల్సిన అవసరం కూడా వుండేది కాదు. మనస్సుకు హత్తుకు పోయేలా ఎంతో మృదు మధురంగా చెప్పేవారు. ఆ చెప్పే విధానం మనస్సును చలింప జేసేది, కన్నీరు కార్పించేది, ఆలోచనలు రగిలింప జేసేది. జీవితంలో ఎన్నో జరిగాయి. అవన్నీ మర్చిపోయాను. కాని భుజంగ రాయశర్మను, ఆయన చెప్పిన పాఠాలను మర్చిపోలేకున్నాను. నేనే కాదు - ఆయన వద్ద చదువుకొన్న ఏ విద్యార్థి వాటిని మరచి పోలేడు. భుజంగ రాయశర్మ కేవలం అధ్యాపకుడు మాత్రమే కాదు. జీవితం అంటే ఏమిటి? ఎలా జీవించాలని తన విద్యార్థులకు చెప్పేవారు. ఆయన వద్ద

కొరవ 8 పేటిలో

జనవాణి

విషయమై నిమ్మకు నీరెత్తినట్లుంది. వెంటనే ముఖ్యమంత్రి జన్మభూమి పనులాపి, కరువు పనులు చేపట్టాలి.

నెల్లూరు జె. పోలిరెడ్డి

భుజంగరాయ శర్మ గొప్ప లెక్చరర్!

స్వర్గీయ భుజంగ రాయశర్మ

కొట్టు బాడుగకు

నెల్లూరు పట్టణ నడిబొడ్డున ఎ.సి. సెంటర్ వద్ద నిర్మలా కాఫీ వర్క్స్ మిద్దెపైనగల షాపు రూం బాడుగకు ఇవ్వబడును. కావలసిన వారు ఈ క్రింది అడ్రస్ నందు సంప్రదించవలెను.

నిర్మలా కాఫీ వర్క్స్
మిద్దెపైనగల షాపు రూం



భక్తవత్సలనగర్‌లో నిమెంటు రోడ్డు నిర్మాణపు పనికి శ్రీకారం చుడుతున్న కౌన్సిలర్ వనజాక్షి నిలబడి చూస్తున్నవారు మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మునిసిపల్ ఛైర్మన్ ఆనం వివేకానందరెడ్డి

ఆర్‌టీసిని ప్రైవేటు పరం చేయడమెందుకో అర్థమే కావడం లేదు!

ఆర్టీసి ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కార్మికులు 25 తేది ఎన్టీఆర్ హోమ్‌లో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ బిట్టి శేషారెడ్డి మాట్లాడుతూ దేశసంపదను కొద్దిమంది చేతుల్లో పెట్టి ప్రయత్నమే ప్రైవేటీకరణ. దీనివల్ల పేదరికం, నిరుద్యోగం విపరీతంగా పెరిగి యువత జీవితాల్ని దెబ్బ తీస్తుందన్నారు. ప్రైవేటు రంగ సంస్థలు ప్రజల సంపదను దోచుకోవడమే కాకుండా ప్రభుత్వానికి పన్నులు ఎగ్గొడుతున్నాయని; కార్మికులంతా సంఘటితంగా ఎదుర్కొంటే ఏ ప్రభుత్వాలు ఏమీ చేయలేవన్నారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జి. దశరథ రామయ్య మాట్లాడుతూ ఆర్టీసిని ప్రైవేటీకరించే చర్యల్లో భాగంగా ఇప్పటికే వాషింగ్, స్వీపింగ్, రిజర్వేషన్ వంటివి ప్రైవేటు పరం చేశారు. కోట్ల ఆస్తులున్న సంస్థను పరుల ధారాదత్తం ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. సదస్సులో ఎన్. చిన్నపు రెడ్డి, నారు కృష్ణయ్య, ఎం. మోహన రావు, ఎన్టీవో సంఘ నాయకులు నారాయణ, వి. శ్రీనివాస రావు పాల్గొన్నారు. సదస్సుకు ముందు కార్మికులు ఆర్టీసి బస్టాండు నుంచి ఎన్టీవో హోమ్ వరకు ప్రదర్శన నిర్వహించారు.

కవయిత్రుల సమ్మేళనం

సింహపురి సాహిత్య సాంస్కృతిక అకాడమీ నిర్వహించే కవయిత్రుల సమ్మేళనం 7 తేది ఉదయం దొడ్ల పద్మావతమ్మ మహిళా గ్రంథాలయంలో జరుగు తుందని అకాడమీ కార్యదర్శి పాయసం సుబ్రహ్మణ్యం తెలియ జేస్తున్నారు.

కార్యకర్తలను నిర్లక్ష్యం చేసినందుకే కాంగ్రెస్‌కు ఈ దుర్గతి పట్టింది!


స్వాతంత్ర్య ఉద్యమంలో దేశం కోసం అనేక త్యాగాలు చేసిన కాంగ్రెస్ నాయకుల జీవితాలను పార్టీ కార్యకర్తలు ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని మాజీ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పిలుపు నిచ్చారు. 24 తేది ఆనంవారి వీధిలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గాంధీ, నెహ్రూ, పటేల్, రాజాజీ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ఎన్నో త్యాగాలు చేశారు. గతించిన నాయకులు చేసిన గణనీయమైన సేవలు ఈ తరం వారికి కార్యకర్తలే తెలియ జేయాలి. అదే విధంగా జిల్లాలో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ఎంతో మంది శూరులున్నారు; వీరిని గూర్చి కార్యకర్తలకు తెలియజేసి అలనాటి స్ఫూర్తి మళ్లీ కలుగ జేసేందుకు జిల్లా కాంగ్రెస్ స్వర్ణోత్సవాలు ఘనంగా జరపాలని వేదురుమల్లి జనార్దన రెడ్డి నాయకత్వంలో నిశ్చయించినట్లు చెప్పారు. డిసిసి అధ్యక్షుడు సివి శేషారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని జిల్లాలో విస్తరింప జేసేందుకు వర్గాలు, విభేదాలు విస్మరించి ప్రతి కాంగ్రెస్‌వాదీ కలసికట్టుగా కృషి జేయాలన్నారు. మునిసిపల్ ఛైర్మన్ వివేకానంద రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం పోరాడింది కాంగ్రెస్ పార్టీ, అనంతరం దేశాన్ని పరిపాలించింది కాంగ్రెస్ పార్టీ; లౌకిక సమైక్య భారతాన్ని కాపాడింది కాంగ్రెస్ పార్టీనే నన్నారు. జిల్లాలో స్వర్ణోత్సవాల సందర్భంగా పార్టీని ప్రజల వద్దకు తీసుకెళ్లే ప్రయత్నంలో భాగంగా 10 రోజులు 'ప్రజా సన్నిహిత యాత్రలు' చేయనున్నట్లు చెప్పారాయన. అల్లూరు మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలను నిర్లక్ష్యం చేయడం వల్ల రాష్ట్రంలో, కేంద్రంలో పార్టీ అధికారం కోల్పోయినట్లు చెప్పారు. సభకు మాజీ ఎమ్మెల్యే కెవి సుబ్బారెడ్డి, డిసిసి కార్యదర్శి దేవకుమార్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు సునీల్‌కుమార్ రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సి. ప్రవీణ్ కుమార్ రెడ్డి, కలవకూరు విజయశేఖర్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పందిళ్లపల్లి అరుణమ్మ ఇతర యువ నాయకులు హాజరయ్యారు.

నెల్లూరుసంగతులు

వికలాంగులకు ధృవీకరణ పత్రాలు

జిల్లాలో మూడవ విడత జన్మభూమి కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరాల్లో 8,218 మంది వికలాంగులకు ధృవీకరణ పత్రాలిచ్చినట్లు కలెక్టర్ సాంబశివ రావు

కొరవ 10 పేజీలో



ఆగష్టు 15 తేది దర్గామిట్ట హైస్కూలులో స్వాతంత్ర్య సమరయోధుడు వక్తి సుబ్బారావును సత్కరిస్తున్న హెడ్మాస్టర్ టి. జనార్దనరెడ్డి, కవి జయంపు కృష్ణ

ఆయిల్ ట్యాంకరను అల్లాడిస్తున్న పోలీసులు

ఆయిల్ ట్యాంకర్లను పగటి వేళ టౌన్‌లోకి రానివ్వక పోవడంతో అనేక సమస్యలు ఉత్పన్న మవుతున్నాయి. ఆయిల్ ట్యాంకర్లు భారీ వాహనాల జాబితాలోకి వచ్చినా, అత్యవసర సర్వీసుల క్రింద వాటిని టౌన్‌లోనికి అనుమతించమని హెడ్ ఎస్సై పూర్ణచంద్ర రావు ట్రాఫిక్ పోలీసులకు ఆదేశాలిచ్చారట. కానీ కొత్త ఎస్సై రాగానే హెడ్ ఎస్సై మాటను ట్రాఫిక్ పోలీసులు ఖాతరు చేయడం మానేశారు. లంచమిస్తే గాని ట్యాంకర్లను టౌన్‌లోనికి అనుమతించడం లేదని పెట్రోలు బంకుల వాళ్లు ఫిర్యాదు. దీనివల్ల టౌన్‌లో అప్పుడప్పుడు పెట్రోల్, డిసిల్ కొరత ఏర్పడుతున్నది. మధ్యాహ్నం నుంచి పెట్రోల్ ట్యాంకర్లు సాయంత్రం 4 గంటల నుంచి 8, గంటల మధ్య నెల్లూరుకు వస్తుంటాయి. ఈ సమయాల్లో ట్రాఫిక్ పాయింట్లలో పోలీసులు వీటిని టౌన్‌లోనికి రానివ్వడం లేదు. పెట్రోల్ బంకులన్నీ టౌన్‌లోనే ఉండడం వల్ల తప్పనిసరిగా వెళ్లాల్సిన పరిస్థితి. ఒక ట్యాంకర్ డ్రైవర్‌కు పోలీసులు ఐదేపల దేహశుద్ధి చేయడంతో పెద్ద గొడవ రేగింది. లంచాలిచ్చిన లారీలను టౌన్‌లోకి వదిలే ట్రాఫిక్ పోలీసులకు పెట్రోల్ ట్యాంకర్లను చూస్తేనే రూల్స్ ఎందుకు గుర్తుకు వస్తున్నాయో? ఎస్పీగారూ, మీరొకసారి ఈ విషయాన్ని పరిశీలించి – పరిష్కరించండి.

బ్రాందీ అంగళ్ల జోలికి వెళ్లే ఏ అధికారికైనా బదలీ శిక్షే!

కొత్తగా వచ్చిన పట్టణ సిఐ సాయిబాబా పలువురి పాలిట సింహస్వప్నంలా మారారు. డ్యూటీని హుషారుగా చేయాలన్న తలంపు గల సిఐ, మొన్నటి వరకు డిఎస్పీగా పనిచేసిన మూర్తితో కలిసి బ్రాందిషాపుల వారిని గడగడ లాడించారు. తానే బీట్ డ్యూటీలో తిరుగుతూ యూటిజర్ల పని పట్టారాయన. మారువేషంలో వెళ్లి బ్లూఫిలిమ్ బిట్స్ ఒకటిలి చూపిస్తున్న విజయమహల్ వీడియో థియేటర్‌ను సీజ్ చేశారు. 24 తేది జెండా వీధి, తూకుమాను మిట్ట, గుప్త పార్కు, లిస్సీ సెంటర్, రంగనాయకుల పేటల వద్ద సింగిల్ నంబర్ లాటరీ ఆడుతున్న, నిర్వహిస్తున్న కొంత మందిని అరెస్ట్ చేశారు. పేరున్న మూడు లాడ్జీలపై దాడిచేసి పేకాట ఆడుతున్న 15 మందిని, వ్యభిచారం చేస్తున్న మరి కొందరిని, సినిమా హాళ్ల వద్ద బ్లాక్ టిక్కెట్లు అమ్ముతున్న ఏడు మందిని అరెస్ట్ చేసి 27 తేది కోర్టుకు హాజరు పర్చారు. సిఐపై తాజాగా బ్రాందీ అంగళ్ల యజమానుల సిండికేట్ కన్ను పడింది. కుర్చీకి పరిమితం కాకుండా డ్యూటీ చేస్తున్న సాయిబాబాను అన్ని వ్యాపారాల్లో ఆరితేరిన పెద్దలు ఎన్నాళ్లు డ్యూటీ చేయనిస్తారో ఆ షిర్డిసాయి నాథుడికే ఎరుక!

డిఎస్పీ వలెనే టౌన్ సిఐనీ సాగనంపుతారా?

మహమ్మద్ రఫీ మ్యూజికల్ నైట్

రఫీ మ్యూజికల్ అకాడమీ గత నాలుగేళ్లుగా యాదే రఫీ మ్యూజికల్ నైట్‌ను నిర్వహిస్తుంది. మధుర గాయకుడు రఫీ 17వ వర్ధంతిని పురస్కరించుకొని 31 తేది ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. గాయని గాయకులు ఖాదర్ ఖాన్, జిలానీ బాషా, బాబు, జిలూ, హుమయూన్, అబ్‌హర్, రహీం, తన్వీర్, ఖలీల్, దావీద్, షబ్బీర్, అహ్మద్ షరీఫ్, డాక్టర్ జకి, మైథిలి, సాబిదా త రఫీ తదితరులు పాడిన పాటలలో కొన్నింటిని వినిపిస్తారు. ఈ కార్యక్రమానికి మునిసిపల్ ఛైర్మన్ ఆనం వివేకానంద రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తారని ఆర్గనైజర్ బాకీర్ హుస్సేన్ తెలియజేస్తూ; అందరినీ కార్యక్రమానికి రమ్మని ఆహ్వానిస్తున్నాడు.

నెల్లూరు వుబుసుకు

విశ్లేషకుడు

జనార్దనరెడ్డి

మాజీ ముఖ్యమంత్రి శ్రీ ఎన్ జనార్దన రెడ్డి 27 తేది నెల్లూరు వచ్చారు; 28 తేది వెంకటగిరి; 30 తేది మళ్లీ నెల్లూరు. స్వాతంత్ర్య స్వర్ణోత్సవాలు పర్యటనోద్దేశ్యం.

జన్మభూమి – కలెక్టర్ కాయకష్టం

జిల్లాలో జన్మభూమి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కలెక్టర్ డాక్టర్ ది. సాంబశివ రావు అహోరాత్రులు శ్రమిస్తున్నారు. నిద్రాహారాలు మరచి పోయినట్లున్నా రాయన. ఎక్కడే మారుమూల ఏ చిన్నపని జరుగుతున్నా స్వయంగా వెళ్లి పరిశీలించి వస్తున్నారు. ఏ గ్రామం నుంచి ఎవరు ఏ విన్నపంతో వచ్చినా ఓపికగా అధ్యయనం చేసి నిధులు మంజూరు చేస్తున్నారు. తన పరకు రాజకీయాలు, అధికారంలో వుండే వారి ఒత్తిడులకు దూరంగా వుంట గల్గుతున్నారు కలెక్టర్. నిజాయితీగా పనిచేయ డానికి ముందుకు వచ్చేవారు ఏ పార్టీ వారైనా ఆదరిస్తున్నారు. ఒక పని జరిగితే తప్ప రెండవదాన్ని అనుమతించడం లేదు. ప్రతి పనినీ విజిలెన్స్ దర్యాప్తు చేయించి సాధ్యమైనంత వరకు నాణ్యత పాటించేట్లు చూస్తున్నారు.

రాష్ట్రంలో మరే కలెక్టరూ ఇంత శ్రద్ధగా ఈ పనులు నిర్వహిస్తున్నట్లు కన్పడడం లేదు. అదృష్టం బాగుంటే స్టేట్ ఫస్ట్ అవార్డు సాంబశివ రావు గారికే లభించాలి; లభిస్తుందనే ఆశిద్దాం!

ఆక్రమణల తొలగింపుకు రెడీ

ఐదుశాఖల మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి పట్టుదల వల్ల నెల్లూరు టౌన్‌లో ఆక్రమణల తొలగింపుకు సిద్ధమౌ , తున్నారు అధికారులు. పెన్న వంతెన నుంచి అయ్యప్ప గుడి వరకు నేషనల్ హైవే ప్రక్కన వుండే ఆక్రమణలు తొలగించడం తొలి కార్యక్రమం. ఈ మధ్యలో 700 అక్రమ కట్టడాలున్నాయని గుర్తించారట. ఒకటి రెండు రోజులలో వాటన్నిటినీ పగులగొట్ట బోతున్నారు.

అయితే ఈ తొలగింపు పని కేవలం బంకులు, గింకుల వంటి సన్న జనానికి పరిమితమౌ తుందా లేక రోడ్డుకి పొడుచుకొని వచ్చిన పెద్ద పెద్ద భవంతులు నిర్మించిన వారినీ కదిలిస్తారా అన్నది వేచి చూడాల్సిందే! ముఖ్యమంత్రి స్వయంగా విధాన ప్రకటన చేసి, ఆక్రమణలు తొలగించాలని రాష్ట్రంలోని అధికార్లందరకు ఉత్తర్వులు చేసినందువల్ల తెలుగు దేశం ఎమ్మెల్యే లెవరూ ఇందులో జోక్యం చేసుకో బోరనుకుంటాము. రాజకీయ జోక్యం లేకుంటే అధికార్ల పని సులువౌతుంది. అయితే తొలగించే బంకులకు – ఎక్కడైనా విశాలమైన స్థలం లభిస్తే పునరావాసం చూపించడం సమంజసం.

నేషనల్ హైవేతో పాటు పొదలకూరు రోడ్డునూ శుభ్రం చేయడం అవసరం. పనిలో పనిగా నేషనల్ హైవేకు తూర్పు, రైలుకట్టకు పడమరగా మాస్టర్ ప్లాన్ ప్రకారం వుండవలసిన సమాంతర రోడ్డునూ రెడీ చేస్తే టౌన్‌లో ట్రాఫిక్ సమస్య చాలా వరకు సమసి పోతుంది. సౌత్ స్టేషన్ అండర్ బ్రిడ్జి నుంచి వేదాయపాళెం వరకు రోడ్డు మార్కింగ్ వుంది. కాని మధ్య మధ్యలో ఆ స్థలంలో ఏకంగా ఇళ్లే కట్టేసి

కొరవ 6 పేజీలో

కృష్ణనీరు సాగరాన్ని ముంచెత్తుతుంటే సోమశిలలో కరువు సిగ్గుచేటు!

శ్రీశైలం రిజర్వాయర్‌లో కృష్ణ నీరు పరవళ్లు త్రొక్కుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. నిన్న (29 తేది) రిజర్వాయర్ చెక్కలన్నీ ఎత్తివేసి క్రిందకు 4 లక్షల క్యూసెక్కుల నీరు వదిలేశారట. నాగార్జున సాగర్ సైతం నిండుగా వుంది. అందుపల్ల ఆ నీరంతా వృధాగా సముద్రంలో కలవ వలసిందే. ప్రకాశం బ్యారేజి దగ్గర కృష్ణ నీరు సాగరానికి తరలిపోయే దృశ్యం చూడడానికి మనోజ్ఞంగా వుంది కాని – ఆ వృధాను తల్చుకొంటే కడుపు మండుతూంది.

కృష్ణ వరద నీటిని వుద్దేశించి నిర్మించింది – తెలుగు గంగ ప్రాజెక్టు, సోమశిల, కండ్లేరు రిజర్వాయర్లు రెండూ అందులో అంతర్భాగమే. అయితే ఆ రెండూ ఇప్పుడు పటిపోయి వున్నాయి. సోమశిలలో 13 టిఎంసిలు, కండ్లేరులో బెడ్‌లెవల్ నీళ్లు మాత్రం వున్నాయి. పెన్న పాత ఆయకట్టు సమస్తం నీటి కొరతను ఎదుర్కొంటుంది. నెల్లూరు చెరువు క్రింద వుండే పొట్టిపాళెం వంటి గ్రామాల రైతులు ఎండిపోతున్న పైర్లను రక్షించు కోవడానికి నీటిచుక్క రాల్చమని అధికార్ల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. వెల్లూరు జిల్లాలో ఇప్పటి వరకు వర్షపాతం సక్రమంగా లేదు. రేపు అక్టోబరు నవంబరులలో తుఫాను తాకిడి తగిలితే తప్ప, నెల్లూరుకు కరవు తప్పదు.

ఈ పరిస్థితులలో వృధాగా సముద్రానికి తరలివెళ్తున్న లక్షలాది క్యూసెక్కుల నీటిని సోమశిలకు, తద్వారా కండ్లేరుకు తరలించు కోవడం

వృధాగా క్రిందకు వదిలేకంటే 30 టిఎంసిల నీళ్లు ఇటు మళ్లించమని ఏ తెలుగునేతా అడగడేమి?

ఎంతో శ్రేయస్కరం. ఈ రెండింటిలో కలిసి కనీసం 70 టిఎంసిల నీరు నిల్వ చేసుకొనే వీలుంది. అదే జరిగితే పై ఏడాది చివరి వరకు ఆయకట్టు రైతాంగానికి నిశ్చింత. శ్రీశైలం నుంచి పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా, నిప్పులవాగుకు; అక్కడి నుంచి కుందు వరికి; తద్వారా పెన్నా వరికి నీళ్లు వదిలే అవకాశం వుంది. గత ఏడాది ఈ మార్గంలోనే శ్రీశైలం నీరు సోమశిలకు తరలించి ముద్రాసు గొంతు తడిపారు. ఇప్పుడూ అదే చేయడం చాలా సులభం. ఇప్పటికైనే దానికి కృష్ణ రైతాంగం అభ్యంతరం చెప్పదు. వరద సమసిపోయాక రిజర్వాయర్ నీళ్లు తాకితే వారికి కష్టం కల్గుతుంది. అంత వరకు కాలయాపన చేసి, దురదృష్టవశాత్తు పెన్నకు వరద రాకుంటే ఈ రెండు రిజర్వాయర్లూ పట్టిపోతాయి; కరవు తాండవిస్తుంది.

ప్రభుత్వ విధాన నిర్ణయం తీసుకొంటే ఒకే ఒక్క క్షణంలో కృష్ణ నీరు నిప్పుల వాగులోకి దూకుతుంది. ఆ మేరకు ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యలు ప్రయత్నించాలి. ఇప్పటి వరకు వారిలో ఏ ఒక్కరూ ఈ విన్నపం చేయలేదు; కనీసం కలెక్టర్ గారైనా ప్రభుత్వాన్ని అభ్యర్థించి, నీళ్లు తెప్పిస్తే రైతాంగం కృతజ్ఞతలు చెప్తుంది. *

విత్తనాల వడ్లు
NLR 33359
120 రోజులలో పంట కొచ్చేవి. సెప్టెంబర్‌లో నారు పోయటానికి అనువైనవి వున్నవి. కావలసినవారు సంప్రదించండి.
దొడ్డ మురళికృష్ణారెడ్డి
బుచ్చి – ఫోన్: 73453

PHILIPS
COLOUR TELEVISIONS

బ్లాక్ & వైట్ టివిలు, రేడియోలు, ఓవర్ రికార్డర్లు, కార్ ప్లేరియోలు
Authorised Showroom Phone: 323446
S.S. POINT
Opp. Hotel Ramakanth, Trunk Road, Nellore - 1





శ్రద్ధాంజలి



మా తండ్రిగారైన
అల్లూరు కృష్ణారెడ్డి
19.8.97 తేది మంగళవారం స్వర్గస్తులైనారు.
వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ.
30.8.97 తేది శనివారం వెద్దకర్మ
అల్లూరుపేటలోని మా స్వగృహమున జరుగును.
బంధుమిత్రులకు తెలియజేడమైనది.

భార్య: సీతారామమ్మ
కుమారులు: పెంచలరెడ్డి – శ్రీనివాసులు రెడ్డి
కోడళ్లు: ప్రమీల – హరిప్రియ

వరుడు కావలెను

పుదూరు ద్రావిడ కాశ 23 సంవత్సరముల ఎం.బి.ఏ. అమ్మాయికి గ్రాడ్యుయేటు తిగ్రీ వున్న వరుడు కావలెను. ఆత్రస్సు వేదం రాధాకృష్ణ మూర్తి, పి.హెచ్.తి. (ఫిజిక్స్), రిజిస్టర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్, 16-2-751/A/62 గడ్డిఅన్నారం, హైదరాబాదు. భాషాభేదము, కాళా భేదములు లేవు. వరుడు 20/160/తిగ్రీ

Before the II Addl. Motor Accidents Claims Tribunal, Nellore

O.P. No. 24/97

Rapur Ramaiah ... Claimant

Vs.

1. Sri Sk. Sirajuddin and another ... Respondents

To: (1) Sri Sk. Sirajuddin, owner of Lorry No. AP-26-T-7273, Door No. 27/263, Police Colony, Dargamitta, Nellore.

Whereas the above named claiment has filed an application before the above Tribunal and you are mentioned as a part to the proceedings and the same is being posted to 16.9.1997, and you are therefore hereby required to be present before the above Tribunal on the said date at 10.30 AM., and make your objections if any either in person or through an Advocate. Otherwise the matter will be decided exparte.

// by order //

K. Umamaheswara Rao
Advocate for Claiment

నెల్లూరు మూడవ అదనపు డిస్ట్రిక్ట్ మున్సిఫ్ కోర్టులో

O.S. No. 574/90

దబ్బుగుంట సంజీవమ్మ ... వాది

Vs.

జంగాల వెంకటసుబ్బయ్య ... ప్రతివాది

నోటీసు

పై నంబరులో ఈ క్రింది షెడ్యూలు దాఖలా భూమిలోని 1997-98 సంవత్సరమునకు 1406 ఫసలీకి కౌలు హక్కు 31.8.97 తేదిన పగలు 10.00 గం.లకు ములుమూడి గ్రామంలో రిటీపరు గారి వలన బహిరంగ వేలము జరుప బడును. వేలము షరతులు రిటీపరు గారి వద్ద తెలుసుకొన వచ్చును.

షెడ్యూలు

Nellore District Registration - Nellore Sub-Registration - Mulumudi Village - Wet land one acre (Ac.1.00) in a total extent of land of Acs.2.32 in Patta No.397 and Survey No.216-A; bounded by: North: Dodla Chinnaiah's land, East: Dodla Ramaiah's land, West: Nellore Cheruvu channel, South: Chittamuru Narasa Reddy's land.

Extent: One Acre;
Value: Rs.12,000/-

ఆం. రామచంద్రారెడ్డి
అడ్వకేట్ రిసీవరు

నెల్లూరుముచ్చట్లు

5 పేజీ కొరవ

వున్నారు. వాటివి తొలగించ గల్గితే ట్రంకు రోడ్డుకు ప్యారలల్ రోడ్డు ఏర్పడుతుంది. సగం ట్రాఫిక్ అటు మళ్లుతుంది. చాలా సమస్యలు పరిష్కారం అవుతాయి. కలెక్టర్ గారు ఒకసారి పరిశీలించాలి.

సాగునీటి సంఘాలకు నిధులు వచ్చాయి

నాలుగు నెలల క్రితం ఎన్నికలు జరిగిన సాగునీటి సంఘాలకు నిధులు విడుదల చేసింది ప్రభుత్వం. ఎకగ్రీవంగా ఎన్నికైన సంఘాలకు యాభైవేల లెక్కన; ఎన్నికలు జరిగిన వాటికి రూ.30 వేల చొప్పున నిధులు ఇచ్చారు. ఏదైనా బ్యాంకులో జాయింట్ అకౌంట్ ఓపన్ చేసి నిధులు వాడుకోవచ్చు. జిల్లాలో మొత్తం 450 సంఘాలకు 3 కోట్ల 19 లక్షలు విడుదల చేశారు.

రేషన్ కార్డులు


మండలాని కొకటి లెక్కన చొకడిపోను ఎంపిక చేసి రేషన్ కార్డులు పరిశీలిస్తే – 2 వేలా 644 సబ్సిడీ బియ్యం కార్డులు; 1326 గులాబి కార్డులు దొంగవని తేలాయట. 1006 సబ్సిడీ బియ్యం కార్డులను గులాబి కార్డులుగా మార్చారట. కలెక్టర్ గారు - 26 తేది జరిపిన ఆహార సలహా సంఘం సమావేశంలో ఈ సంగతి చెప్పారు. మండలానికి ఒక షాపు పట్టి చూస్తేనే ఇన్ని వేలు దొంగ కార్డులు దొరికాయి; ఇక జిల్లాలోని 1775 అంగళ్లు పరిశీలిస్తే ఎన్ని వేలు దొరుకుతాయో! జిల్లాలో ఇప్పుడు 4 లక్షలా 72 వేలా 525 తెల్ల కార్డులు; లక్షా 54 వేలా 603 గులాబి కార్డులు వున్నాయి. కార్డుల కోసం వెయిటింగ్‌లో వుండే వారు లక్ష మంది వరకు వున్నారు. జనాభా సంఖ్యతో పోల్చి చూస్తే ఇది చాలా ఎక్కువ. అంటే ఇప్పుడున్న వాటిలో కనీసం పాతిక భాగం డీలర్ల ఉదర పోషణార్థం ఉపకరిస్తున్నా యన్నమాట. వీటినన్నింటినీ ఏరి పారేయ గల్గితే ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం; వెయిటింగ్‌లో వుండే వారికి ఉపశమనం లభిస్తాయి. కానీ ఏ ఎమ్మార్వో కూడా అందుకు సిద్ధపడడు; సిద్ధపడితే నెలవారీ మామూళ్లు ఆగిపోతాయి కదా?

నెల్లూరులో బైటాన్ షోరూం

నెల్లూరు ట్రంకు రోడ్డులో బైటాన్ గడియారాల షోరూం ప్రారంభించారు. కోమల విలాస్‌కు ఎదురుగా నూతన భవనంలో అత్యంత శోభాయమానంగా అలంకరించిన షోరూం ఇది. దేశం మొత్తం మీద బైటాన్‌కు 92 షోరూంలు వున్నాయట. 21 తేది ఉదయం కంపెనీ వైస్ ప్రెసిడెంట్ శ్రీ బిజూ కురియన్ షోరూంకు రిబ్బను కత్తిరించారు. ఇక్కడ గడియారాలతో పాటు బైటాన్‌వారి బంగారు ఆభరణాలు సైతం విక్రయిస్తారు. తనిష్క్ బ్రాండ్‌తో బైటాన్ కంపెనీ ఆకర్షణీయమైన బంగారు నగలు మార్కెట్ చేస్తున్నది. అవి ఇప్పటిక్కడే లభిస్తాయి.

షటిల్ పోటీలలో నెల్లూరు విజేతలు

ఇటీవల టంగుటూరులో జరిగిన రాష్ట్రస్థాయి వెటరన్ షటిల్



బ్యాడ్మింటన్ పోటీలలో ఇద్దరు నెల్లూరు క్రీడాకారులు విజయం సాధించారు. సింగల్స్‌లో శ్రీ కె. రామారావు ఫైటిల్ గెల్చుకోగా; డబుల్స్‌లో ఆయన, శ్రీ .సుంకు రామమోహన రావులు రెండవ



స్థానం సాధించారు. రామమోహన రావు లయన్స్ క్లబ్ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనే సేవాభావం కల్గిన యువకుడు. వ్యాపారం, ఇతర వ్యాపకాలలో బిజీగా వుంటూ కూడా ఆటలలో ప్రావీణ్యత నిల్పుకొన్న ఈ ఇద్దరు క్రీడాకారులకు మా అభినందనలు.

పిడబ్ల్యుడిలో ఎమ్మెల్యే దౌర్జన్యం?

నెల్లూరు పిడబ్ల్యుడి ఆఫీసులో రెండు వారాల క్రితం జరిగిన టెండర్లలో రాపూరు ఎమ్మెల్యే శ్రీ ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డి దౌర్జన్యంగా ప్రవర్తించినట్లు చెప్తున్నారు. రాపూరు ప్రాం.లో జరిగే ఒక పనికి టెండరు వేయడానికి వచ్చి, కాంట్రాక్టర్లందరనీ బెదరించి, టెండరు బాక్సుకు అడ్డంగా నిలబడి, తన ఇష్టమైన వ్యక్తి చేత టెండరు వేయించాడట.

మృత్యుంజయుడు పురంధర ప్రసాద్

కనకమహల్ కుటుంబీకుడు, స్వర్గీయ కనకం బాబు కుమారుడు శ్రీ ఎన్. పురంధర ప్రసాద్ యమలోకం వాకిట వరకు వెళ్లి, మృత్యుంజయుడుగా తిరిగి వచ్చాడు. 19 తేది ఉదయం హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కబోతుండినాడట. కాలుజారి, ప్లాట్‌ఫారంకు, రైలుకు మధ్యలో పడ్డాడు; తలోగా రైలు కదిలింది. కదిలే రైలు ఆయన్ను తపతో లాక్కొని పోయింది. ఒక ఫర్లాంగు దూరం ఈడ్చి ఉడ్చేసిందట. తలోగా ఫైన్‌లాగి రైలాపి ఆస్పత్రికి తరలించారు. అదృష్టం – అంత ప్రమాదం జరిగినా చిన్నదెబ్బలు తప్ప ప్రాణాపాయం ఏర్పడలేదు. ఫ్యాక్చర్లు కూడా లేవు. నిజంగా పురంధర్ మృత్యుంజయుడే!

కెపి నారాయణరావు సంతాప సభ

సాహితీ విమర్శకులు దివంగత కెపి నారాయణ రావు సంతాప సభ సెప్టెంబరు 2 తేది పర్వమాన సమాజం ఆధ్వర్యంలో టౌన్‌హాల్ రీడింగు రూమ్‌లో జరుగుతుంది. శ్రీ పివి రమణా రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సభలో నారాయణ రావు అభిమానులు పాల్గొని నివాళు లర్పించాలని కార్యదర్శి పొన్నాల రామసుబ్బా రెడ్డి కోరుతున్నారు.

రేషన్ షాపులు

2వ పేజీ కొరవ

ఇస్తారు. సెప్టెంబర్ 1 తేది కూపన్‌కు 5 కిలోల బియ్యం తెచ్చుకోవచ్చునని ప్రకటిస్తే - ఆ కూపన్ డిశంబర్ 1 తేది వరకు, అంటే 3 నెలల పాటు విలువ కల్గివుంటుందన్నమాట. తదుపరి కూపన్‌కు కూడా అంతే వ్యవధి ఇస్తారు. దీని వల్ల కుటుంబ యజమానులు తమకు వసతి కల్గినప్పుడు, అవసరం పడినప్పుడు మాత్రమే అంగడికి వెళ్లి వస్తువులు తెచ్చుకొంటారు. నెల గడిస్తే రేషన్ అందదన్న భయం వుండదు. మనకు వలె ఒకటి రెండు రోజులలో స్టాక్ అయిపోయిందనే బోర్డులు కన్పించవు. అంగళ్ల ముందు క్యూలు, కొట్లాటలు వుండవు.

అంగడి యజమానులు తమ వద్దకు వచ్చిన కూపన్లను ప్రభుత్వానికి సమర్పించి, రేషన్ ధరకు, మార్కెట్ ధరకు గాఁ వ్యత్యాసం తీసుకొంటారు. ఈ పద్ధతి వల్ల చాలా వుపయోగాలున్నాయి. రేషన్ సరకుల దుర్వినియోగం జరగదు. అవసరమైన వారు అవసరమైనప్పుడు, అవసరమైనంత మేరకే సరకు తెచ్చుకోగల్గుతారు. కూపన్లపై నంబరు వుంటుంది కాబట్టి, బ్లాక్ మార్కెట్ కష్టం.

ప్రపంచ బ్యాంకు సైతం ముఖ్యమంత్రికి ఇదే పద్ధతి ప్రవేశపెట్టమని సూచించింది. అయితే ఇందులోనూ కొన్ని లోపాలు లేకపోలేదు. దొంగనోట్ల వలె దొంగ కూపన్లు విక్రయించే ముఠాలు ఏర్పడడం; సరకులు అవసరంలేని వారు తమ కూపన్లపై వచ్చిన సరకులు ఇతరులకు అధిక ధరలకు అమ్మడం తదితర సమస్యలు వుంటాయి. కాని ఇప్పటి పద్ధతిలోని అక్రమాలతో పోలిస్తే ఇవి అదుపు చేయలేనివి కాదు.

- డాక్టర్ దుర్గాప్రసాద్

షేర్‌లోకం

2వ పేజీ కొరవ

మార్చి 340; ఏప్రిల్ 450; మే 500; జూన్ 520; జూలై 600; ఆగస్ట్ 655.... ఇట్లా పెరిగింది షేర్.

వీరి వ్యాపారమూ అట్లే పెరుగుతున్నది. ఈ ఏడాది ఏప్రిల్ - జూన్ మధ్య కాలంలో 3 వేలల్లో లక్ష 20 వేల వాహనాలు అమ్మారు. గత ఏడాది ఇదే కాలంలో అమ్మకాల సంఖ్య కేవలం 84 వేలు. ఇప్పటి వరకు సంబర్‌పన్ స్థానంలో వుండిన బజాజ్ కంపెనీ అమ్మకాలు ఇదే సమయంలో 93 వేల నుంచి 89 వేల వాహనాలకు పడిపోయాయి.

అప్పటికీ హీరోహోండా కొత్తగా ప్రవేశపెట్టిన "స్ప్లెండర్" వాహనం ఇండియా మొత్తం మీద హిట్ అయ్యింది. కాని ఆ లోపాన్ని ఎగుమతులు పూరించాయి. విదేశాలలో దీనికి భలే గిరాకీ ఏర్పడింది.

పరిస్థితి ఇంత ఉత్సాహ పూరితంగా వున్నప్పటికీ ఇప్పుడున్న (రు655లు) ధరలో ఈ షేర్ కొనదగింది కాదు. షేర్ మార్కెట్ విపరీతమైన పతనానికి వచ్చినప్పుడు, తగ్గుదలలో మాత్రమే దీన్ని కొనవచ్చు.

చైనా

రెండవ పేజీ కొరవ

భారతీయుల సంఖ్య రెట్టింపౌతుంది. అంటే అదే స్పీడుతో మనం ఆహార ధాన్యాల ఉత్పత్తి, ఆర్థికాభివృద్ధి పెంచుకోవాలన్న మాట. కానీ చైనా ఆర్థికాభివృద్ధి రేటు 8.8 శాతం వుంటే - మనం 6 శాతం దాటడం లేదు. విదేశీయులు మన దేశంలో ప్రత్యక్ష పెట్టుబడులుగా ఏడాదికి 3 బిలియన్ డాలర్లు సైతం పెట్టడం లేదు; కాని అదే సమయంలో చైనా సంవత్సరానికి 40 బిలియన్ డాలర్లు ఆకర్షిస్తున్నది. వారి స్పీడును అందుకోవడానికి మనకు చాలా సమయం పట్టేట్లుంది.

ప్రకటన

ఇందు మూలముగా యావన్మందికి తెలియ జేయడ మేమనగా, మాకు, నెల్లూరు టౌన్, రామలింగా పురం, ముత్యాలపాళెం నందు సర్వే నంబరు 1576/348లో ప్లాటు నంబరు 5లో 33 1/2 అంకణముల భూమి స్థలము కలదు. 1.9.1992 నాడు రిజిష్టరు పవర్ ఆఫ్ అటార్నీ ద్వారా పై స్థలము అమ్మటకు శ్రీ చీతిరాల మురళీకృష్ణ, S/O వెంకట రత్నం, స్టోన్‌హౌస్ పేట, నెల్లూరు వారికి మేము ఇచ్చియున్నాము. వారు ఆ స్థలమునకు సంబంధించి, ఆడుమానం గాని, అమ్మకం గాని, ఇతర యే విధమైన అన్యాక్రాంతము గాని చేసి యుండలేదు. కాబట్టి మరల 22.7.97 తేది నాడు పై పవర్ ఆఫ్ అటార్నీ మేము రద్దు పరచి యున్నాము.

కనుక, ఇక మీదట పై స్థలమునకు సంబంధించి ఎవరుగాని శ్రీ చీతిరాల మురళీకృష్ణ గారితో జరిపే లావాదేవీలతో మేముగాని, సదరు ఆస్తిగాని బాధ్యులము కాము అనియు, అందు మీదట మేము తీసుకొను సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని అందరికీ తెలియ జేయడమైనది.

గడ్డం రామచంద్రా రెడ్డి
వాకాటి దశరథ రామిరెడ్డి

రామలింగాపురం, నెల్లూరు



కావలి ఐఎంఎ రజతోత్సవ సంవత్సరంగా ఒలేషన్ అవార్డు స్వీకరిస్తున్న నెల్లూరు సైకియాట్రిస్ట్ డాక్టర్ టి. సత్యనారాయణ

తోటపల్లి గూడూరు హాస్టల్‌లో లేని సౌకర్యాలే జాస్తి!

తోటపల్లి గూడూరులోని పెద్యూల్ కులాల బాలుర హాస్టల్ అధ్వాన్నంగా తయారౌతూంది. సాంఘిక సంక్షేమశాఖ నేతృత్వంలో నడిచే ఈ హాస్టల్‌లో 90 మంది పిల్లలున్నారు. వీరి అవసరాలకు తగ్గట్టు ఏ సౌకర్యమూ లేదు. ఒకే ఒక సత్తు చెంబు, రెండు బక్కెట్లు, ఐదారు గ్లాసులతో అందరూ ఐబ్బంది పడాల్సి వస్తుంది. హాస్టల్ ఉన్న భవనానికి తలుపులు లేవు. వైరింగ్ దెబ్బతినడంతో లైట్లు వెలగడం లేదు. బాత్‌రూం, లెట్రిన్ సౌకర్యం లేకపోవడం వల్ల విద్యార్థులు ఆరుబయటే అన్ని కార్యక్రమాలూ నిర్వహించు కోవాల్సి వస్తున్నది. వార్డన్ పిల్లలకు సరియైన భోజనం కూడా పెట్టడం లేదు. ఈ యేడాది పిల్లలకు ఇవ్వవలసిన అవసరమైన మందులను ఇంత వరకు సరఫరా చేయలేదు. వార్డన్ సరిగ్గా ఉండి పిల్లల చదువు విషయాలను పరిశీలించక పోవడం వల్ల, గత ఏడాది 45 మంది పదవ తరగతి చదివే పిల్లలకు గాను 14 మందే ఉత్తీర్ణులయ్యారు. హాస్టల్ చుట్టు ప్రక్కల వాతావరణం దుర్గంధ భూయిష్టంగా వుంది. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకొని హాస్టల్ స్థితిగతులు మార్చాల్సిన అవసరం ఎంతైనా వుంది.

జిల్లావార్తలు

గూడూరులో ఎర్ర చందనం

గూడూరు పోలీసులు ఐదు లక్షల రూపాయలు విలువచేసే 160 ఎర్రచందనం దుంగలు పట్టుకొన్నారు. 26 తేది వెంకటగిరి నుంచి వచ్చిన చందనం లోడును గూడూరులో మరో లారీకి మారుస్తుండగా సిఐ కంపాసపాద్ ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు.

స్మగ్లింగ్ లారీ పట్టుకున్నందుకు ఎస్ఐపై అధికార్ల ఆగ్రహం!

వెంకటగిరి పాత కోటలోని రేషన్ డీలర్ కుందా శేషయ్య తన షాపులోని రెండు బియ్యం బస్తాలను నల్లబజారులో అమ్ముతుండగా ఎస్ఐ చంద్రశేఖర్ పట్టుకొన్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, డీలర్‌పై తగిన చర్య తీసుకోమని ఎమ్మార్వోకు ఒక లేఖ వ్రాశారాయన. తమ శాఖ చేయాల్సిన పనిని పోలీసులు చేయడం అవమానంగా భావించిన రెవిన్యూ శాఖాధికారులు ఈ విషయాన్ని అసలు పట్టించుకోలేదు. డీలర్‌పై కనీస చర్యలు తీసుకోలేదు. ఇటీవల ఎస్ఐ చంద్రశేఖర్ లారీల్లో ఎగుమతి అవుతున్న ఎర్రచందనాన్ని, మద్యాన్ని కూడా స్వాధీనం చేసుకొన్నారు. ఈ విషయాలను ఆయన ఎక్సైజ్, అటవీ శాఖలకు తెలియజేస్తే వారంతా ఆయన మీద ఎదురుదాడి చేసినట్లు తెలిసింది. మీ శాఖ చేయాల్సిన పనులు మీరు చూసుకోండి; ఇతర శాఖల వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని మందలించారట. కళ్లకెదురుగా స్మగ్లింగ్ జరుగుతున్నా తమ శాఖకు సంబంధించిన వ్యవహారంకాదని ఎలా చూస్తూ ఊరుకోవాలని కుర్ర ఎస్ఐ ఫీల్ అయిపోతున్నారు. ఉన్నతాధికారులు ఇక్కడి అధికారుల విషయంలో సమన్వయం కుదిరిస్తే బాగుంటుంది.

మధ్యంతర ఎన్నికలు ఖాయం!

దేశ రాజకీయాల్లో మూడు, నాలుగు నెలల్లో పెనుమార్పులు సంభవిస్తాయని బిజెపి ప్రధాన కార్యదర్శి ఎం. వెంకయ్యనాయుడు తోస్యం చెప్పారు. ప్రజాదర్శన కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు వచ్చిన నాయుడు విలేకరులతో మాట్లాడారు. ఫ్రంటు ప్రభుత్వం బలహీనతను చూసుకొని పీతారాం కేసరి

నిజాయితీ కల్గిన అధికార్లకు జరిగే సత్కారం చీవాట్లా?

నాయకత్వంలో కాంగ్రెస్ పార్టి అధికారం చేపడుతుంది. కానీ అదీ మూణ్ణాళ్ల ముచ్చటగా ముగుస్తుంది; తరువాత మధ్యంతర ఎన్నికలు ఖాయమన్నారు. దేశప్రధాని గుజ్రాల్ అవినీతిని అంతం చేస్తానని ఒక వైపు చెబుతూనే మరోవైపు అవినీతి పరులను రక్షిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో కేసరితో చెట్టాపట్టాలు వేసుకొని తిరుగుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్‌పై కారాలు, మిరియాలు నూరుతున్నట్లు ఎద్దేవా చేశారు. ఎన్టీ రామారావు చనిపోయాక ఆయన చేపట్టిన అభివృద్ధి పథకాలను చంద్రబాబు తుంగలో తొక్కిపేసిన్లు చెప్పారు. డబ్బు పెచ్చితో ఆయన రాష్ట్రాన్ని చైనావారికో, జపాన్ వారికో తాకట్టుపెట్టినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదన్నారు. కేంద్రంలో బిజెపి 13 రోజుల పాలన సినిమా రిలీజ్

కొరవ 8 పేజీలో



హైదరాబాద్ బృందావన్ హోటల్ మేనేజరు నాయుడు రాధాకృష్ణయ్య కుమార్తె సంధ్య, సురేంద్రబాబు వివాహం హైదరాబాద్ టిటిడి కల్యాణ మండపంలో 22 తేది జరిగింది.

దీగులు వ్యాధికి చాలా మందులున్నా ప్రజల్లో చైతన్యం లేదు!

కావలి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రజతోత్సవ వేడుకలు ఇటీవల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరులోని ప్రముఖ మానసిక వైద్యులైన డాక్టర్ టి. సత్యనారాయణను సత్కరించి, ఒలేషన్ అవార్డును బహూకరించారు. డాక్టర్ సత్యనారాయణ దిగులు (డిప్రెషన్) వ్యాధిగూర్చి మాట్లాడారు. మిగతా వ్యాధులతో పోల్చిచూస్తే దిగులు వ్యాధి అతి తరచుగా కన్పించే వ్యాధి. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం వివిధ ఆరోగ్య సమస్యలపై డాక్టర్ల దగ్గరకు పోయేవారిలో 25 శాతం మందికి ఈ వ్యాధి ఉంటుందన్నారు. అతివేగంగా ఊహకందని మార్పులు జరుగుతున్న ఈ స్పీడ్ యుగంలో ప్రపంచంలోని పలుమూలల్లో ఈవ్యాధి దినదినాభివృద్ధి చెందుతుండన్నారు. అభివృద్ధి చెందిన దేశాలైన అమెరికా, యూరపీలలో ఈ వ్యాధి ఎక్కువగా ఉన్నప్పటికీ, ఆయా దేశాల ప్రజల్లో మంచి అవగాహన ఉండడం వల్ల సైకియాట్రిస్టును తొందరగా సంప్రదించి తగిన వైద్యం చేయించు కొంటారు. అయితే మన దేశంలో మూఢనమ్మకాల వల్ల, అనేక దురభిప్రాయాలు మనసులో నాటుకు పోవడం వల్ల తగిన వైద్య సౌకర్యం లభిస్తున్నా ప్రజలు ఉపయోగించుకోవడం లేదన్నారు. దిగులు వ్యాధి నివారణకు, చికిత్సకు ప్రస్తుతం 20కి పైగా మందులున్నా యన్నారు. సైకియాట్రిస్టులు మత్తు మందులు, పాక్‌ట్రిట్‌మెంట్ ఇస్తారన్న అభిప్రాయం సరియైనది కాదన్నారు. కౌన్సిలింగ్, కాగ్నిటివ్ థెరపీల ద్వారా వ్యాధి నయం చేయవచ్చని డాక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో పలువురు డాక్టర్లు పాల్గొని, ఉపన్యాసాన్ని చక్కగా విన్నారు.

గూడూరు ఎక్సైజ్ సిఐ స్టేషన్‌నే సైగ్గా అమ్మేశాడట!

జన్మభూమి పథకాన్ని అడ్డుపెట్టుకొని అతి తెలివిగా ప్రభుత్వ సొమ్మును డ్రా చేసుకోవడంతోపాటు, ప్రభుత్వ ఆస్తిని సొంత ఆస్తిలా విక్రయించిన ఘనుడైన అధికారి కథ ఇది. గూడూరు ఎక్సైజ్ సిఐ అంకయ్య పూర్వాశ్రమంలో కాలేజి లెక్చరర్‌గా పని చేస్తుండే వారు. రాష్ట్రంలో మద్య నిషేధం అమలులో ఉన్న సమయంలో పెద్ద పెద్ద ఆలోచనలతో ఆ ఉద్యోగం మానేసి, తక్కువ జీతం వచ్చే ఎక్సైజ్ సిఐ పోస్టులో జాయిన్ అయ్యారాయన. నిషేధం అమలులో ఉన్నప్పుడు తన అంచనాలకు అనుగుణంగా కష్టపడి అన్ని వైపుల నుంచి బాగా సంపాదించారు. నిషేధం ఎత్తివేసాక కలెక్షన్లు తగ్గడంతో తెలివిగా వివిధ పథకాలను సృష్టించి ఆచరణలో పెట్టారు. పోలీస్ స్టేషన్‌కు రిపేర్ల పేరిట బ్రాంది షాపుల సిండికేట్ వద్ద మామూళ్లు వసూలు చేశారు. ఆ డబ్బుతో స్టేషనుకు రంగు వేయించారు. ప్రహరీ గోడలేదని జన్మభూమి పథకంలో నిధులు మంజూరు చేయమని పై అధికారులకు అభ్యర్థనలుపంపారు. కిల్లా కలెక్టర్ 44,270 రూపాయలు, రోడ్లు భవనాల శాఖ 20 వేల రూపాయలు గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేశాయి. స్టేషన్ సిబ్బంది వద్ద కూడా వితాళాలు వసూలు చేసిన సిఐ; జన్మభూమి నిధులు డ్రా చేసుకొని తన జేబులో వేసుకొన్నారు. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన 3 1/2

జన్మభూమి పేరుతో ప్రహరీ గోడ కట్టి భూకీస్థలాన్ని పరుల పరం చేశారు!

ఎకరాల భూమిలో 200 అంకణాలను చుట్టు ప్రక్కల వారికి రహస్యంగా అమ్మేసి సొమ్ము చేసుకొన్నారు. సరిహద్దు వివాదాలు వస్తాయని వీరి చేతనే స్టేషన్ చుట్టూ ప్రహరిగోడ కట్టించి ఎటువంటి సమస్య లేకుండా చేసుకొన్నారు. పై అధికారుల చేత ప్రహరీ గోడను ప్రారంభింపజేసి మన్ననలు కూడా పొందారాయన. ఇంత ఘరానాగా ప్రభుత్వాన్ని మోసం చేసిన అధికారిపై విచారణ జరిపి తగిన చర్య తీసుకోవడం కలెక్టర్ బాధ్యత.

ఈ ప్రమాదానికి బాధ్యులెవరు?

తోటపల్లి గూడూరు కొత్త కోడూరు వద్ద 21 తేది జరిగిన రోడ్డు ప్రమాదంలో పెన్నేటి మనోహర్ రెడ్డి (25) ప్రాణాలు పోగొట్టుకొన్నాడు. మోటారు సైకిల్‌పై కోడూరు నుంచి కొత్తకోడూరు పోతున్నప్పుడు, ఎదురు వస్తున్న బస్సును తప్పించను, షడన్ బ్రేక్ వేయడంతో బండి బోల్తా కొట్టింది. రోడ్డు గతుకుల, మిట్టల వల్ల ఈ ప్రమాదం సంభవించింది. కంట్రాక్టర్ ఈ రోడ్డు పనిని మధ్యలో నిలిపివేసి ఉండడం వల్ల రోజూ ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి. ఐదు శాఖల మంత్రి తలచుకొంటే ఈ రోడ్డు వేయించడం పెద్దపనా?

వారఫలాలు

తేది 30.8.97 నుండి తేది 5.9.97 వరకు సింహంలో రవి బుధ రాహువులు; కన్యలో శుక్రుడు; తులలో కుజుడు; మకరంలో పితృ గురుడు; కుంభంలో కేతువు; మీనంలో పితృ శని; కర్కాటక సింహ కన్యలలో చంద్రుడు.



మేషం
(అశ్విని, భరణి, కృత్తిక 1పాదం)

ఈ రాశి వారికి ఆదాయం బాగుంటుంది. కుటుంబ సభ్యులలో ఒకరికి అనారోగ్యం, ఉద్యోగులకు కార్యభారం ఎక్కువగా ఉంటుంది. వారాంతంలో నరాల బలహీనత, మిత్రులతో ఉద్యోగులతో మనస్పర్థలు కలుగ వచ్చును. అనవసర పనులపైన వేసుకొని చేయగలరు. అశాల భోజనం, దూర ప్రయాణాలు, పూజాది కర్మలు చేయగలరు.



వృషభం
(కృత్తిక 2,3,4, పాదాలు; రోహిణి, మృగశిర 1,2పాదాలు)

వృత్తి వ్యాపార వ్యవసాయా లందు సామాన్య ఆదాయం. రుణ సంబంధ మగు తగాదాల పరిష్కారం, బంధు మిత్రుల తోడ్పాటుతో పని లందు అనుకూలత యుంటుంది. విద్యార్థుల విద్యా, వివాహ ప్రయత్నాలకు మంచి సమాధానాలు రాగలవు. సత్కర్మలు చేయుట, శుభ కార్యాలలో పాల్గొనడం జరుగు తుంది. ఉదర కోశ రుగ్మతలు, కారీరక శ్రమ, మంచి గౌరవ ముంటుంది.



మిథునం
(మృగశిర 3,4పాదాలు; ఆర్ద్ర; పునర్వసు 1,2,3పాదాలు)

ఇంట బయట వ్యవహారాల వల్ల బాధ ఉంటుంది. ఆదాయం, ఆర్థిక పరిస్థితి బాగుంటుంది. ఇతరులకు సహాయ పడటం, బాకీలు లభించడం, పనులు అనుకూలంగా జరగటం ఉంటుంది. వార ప్రారంభంలో వస్తువులు కొనడం, శుభకార్యాలలో పాల్గొనడం, పథలలో పాల్గొనడం జరుగు తుంది. అధికారుల తోడ్పాటు బాగుంటుంది. వారాంతానికి సమస్యలు సర్దుకొని పోగలవు.



కర్కాటకం
(పునర్వసు 4వ పాదం; పుష్య; ఆశ్లేషలు)

వార ప్రారంభాన కుటుంబ సౌఖ్యం, గౌరవ ప్రతిష్టలు వృద్ధి చెందును. వారాంతంలో కుటుంబ వ్యక్తులకు అనారోగ్యం, పనులు వాయిదా పడటం జరుగుతుంది. ఆర్థిక స్థితి బాగుంటుంది. కొంత బాకీలు లభించ వచ్చును. వారాంతాన ఇంట బయట కొన్ని చిక్కు లుంటును. బంధు మిత్రుల రాకపోకలు, శుభకార్యాలలో పాల్గొనుట, నరాల బలహీనత, కుటుంబ సౌఖ్యం వుంటును. తగాదాలు వద్దు.



సింహం
(మఖ; పుబ్బ; ఉత్తర 1పాదం)

ఆర్థిక పరమైన వత్తిడులు ఎక్కువగా ఉంటాయి. ఆదాయం కంటె ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. అనవసర పనులందు చిక్కు కోవడం, మనస్తిమితం లేకుండుట, అనవసర కాలహరణ వుంటును. ఆరోగ్యం సరిగా యుండదు. ఉద్యోగులు బాగా శ్రమపడ వలసి వచ్చును. తగాదాలు పట్టుకోవద్దు. పిల్లల సంబంధమగు సమస్యలు, వస్తు నష్టము, దూర ప్రయాణము లుండును.




కన్య
(ఉత్తర 2,3,4 పాదాలు; హస్త; చిత్త 1,2పాదాలు)

వ్యాపారం నందు చిక్కులు, సమయానికి డబ్బు చేతిలో లేకుండుట, కుటుంబ పెద్ద లందొకరికి అనారోగ్యం, పనులు నిదానంగా జరుగుట యుండును. ఉద్యోగులపై అధికారుల వత్తిడి ఎక్కువగా వుండును. మాట పరుషంగా ఇంట బయట సమస్య లుండినా సర్దుకొనును. శుభకార్యా లందు పాల్గొనుట, దూర ప్రయాణాలు జరుగును. ప్రతి విషయాన్ని మనసులో దాచుకొన వలెను.



తుల
(చిత్త 3,4 పాదాలు; స్వాతి; విశాఖ 1,2,3 పాదాలు)

ఆర్థిక స్థితి సామాన్యంగా వుండును. నూతన సన్నిహితులు మీ ప్రవర్తన వల్ల ఏర్పడును. ఉద్యోగులు అధికారుల అభిమానాన్ని చూరగొందురు. కుటుంబ సౌఖ్యం బాగుండును. శుభ కార్యాలలో పాల్గొనుట, దైవ మందిరాలను దర్శించుట, మాతవ వస్తువుల వల్ల లాభ ముండును. వారాంతంలో కొద్దిపాటి అనారోగ్యం మీకు, భార్యకు కలుగును. కొత్త వారి పరిచయం కలుగును.



వృశ్చికం
(విశాఖ 4పాదం; అనూరాధ; జ్యేష్ఠ)

వృత్తి వ్యాపార వ్యవసాయా లందు ఆదాయం బాగుండును. ఆర్థికాభివృద్ధి ప్రయత్నాలు కలసి వచ్చును. దూర బంధు వార్తలు తెలియుట, వారాంతంలో ఆడంబరాలకై ఖర్చులు చేయుట, శుభకర్మలు ఆచరించుట యుండును. ఆరోగ్యం పరిగా వుండదు. ఉద్యోగులకు పనుల పత్తిడి ఉండును. శ్రమకు తగ్గ గుర్తింపు వుండును. శుభ కార్య ప్రయత్నాలు చేయవచ్చును. కొత్త వ్యక్తుల స్నేహ వుండును.




ధనుస్సు
(మూల; పూర్వాషాఢ; ఉత్తరాషాఢ 1వపాదం)

అన్ని విధాల ఈ రాశి వారికి బాగున్నది. ఆర్థికాభివృద్ధి, ఇంట బయట గౌరవ మర్యాదలు బాగుండును. ఉద్యోగులు అధికారుల సహాయ సహకారాలు పొందుదురు. మంచి వార్త వినడం, పాత మిత్రుల కలయిక, వృత్తి వ్యాపార విస్తరణ, కుటుంబ సౌఖ్యం వుండును. వ్యవహారాలు, ప్రయత్నాలు అనుకూల మగును. సత్కార్యాలను ఆచరించెదరు.



మకరం
(ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు; శ్రవణ; ధనిష్ఠ 1,2పాదాలు)

ఆర్థిక వ్యాపార పరమైన వత్తిడి, సమస్యలు కలుగుతాయి. అనవసర తగాదాలు కలుగుతాయి. ఖర్చులు పెరిగి ఋణము చేయవలసి వచ్చును. పనులు విధంగా జరుగును. ఉద్యోగుల వృత్తి ధర్మంలో పొరపొచ్చ జరుగ వచ్చు కుటుంబ సభ్యుల ఆరోగ్యం కూడా అంతంత మాత్రమే. అనవసర విషయాలలో జోక్యం వద్దు. అశాల భోజనం, శ్రమ ఉండును.



కుంభం
(ధనిష్ఠ 3,4పాదాలు; శతభిష; పూర్వాభాద్ర 1,2,3 పాదాలు)

ప్రతి పనిలోను ఆందోళన, మనస్తిమితం లేని విద్యార్థులు జరుగ గలవు. ఆదాయ వ్యయాలు సమంగా వుండును. కుటుంబ సభ్యులతో అభిప్రాయ భేదము, ఉద్యోగ కార్యక్రమ, ధనవస్తు నష్టం జరుగును. బంధువుల రాకపోకలు, భార్యకు అనారోగ్యం కలుగ వచ్చును. ఆశించిన ఆదాయం గాని, జరుగ వలసిన పనులు వాయిదా పడును. వారాంతంలో శుభ కార్యా లందు పాల్గొంటారు.



మీనం
(పూర్వాభాద్ర 4వపాదం; ఉత్తరాభాద్ర; రేవతి)

వృత్తి వ్యాపారా లందు ఆశించిన రాబడి ఉండదు. పనులందు విసుగు శ్రమ వుంటుంది. అయిన వారి వల్ల పనులకు ఆటంకాలు ఏర్పడతాయి. స్వల్ప అనారోగ్యం వుంటుంది. పెట్టుబడులపై ఆందోళన వుండును. బంధు మిత్రుల సమావేశం వారాంతాన జరుగును. పిల్లల విద్యావృద్ధి వుండును. వివాహ ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలించ వచ్చును. తొందరపాటు పనికి రాదు.

పంచాంగం

పంచుగలు

తే 30 శనివారం శని త్రయోదశి
తే 5 శుక్రవారం వినాయకచవితి

ముహూర్తాలు

తే 4.9.97 గురువారం ఉదయం గంట 11.31లకు వృశ్చిక లగ్నావ ఉపనయన వివాహ, వ్యాపార ప్రారంభాలకు సుముహూర్తాలున్నాయి

ఆగష్టు తిథులు
శ్రావణ బహుళ

తే 30 శని త్రయోదశి రా.గ. 12.38 వ
తే 31 ఆది చతుర్థి రా.గ. 2.04 ప

సెప్టెంబరు తిథులు

తే 1 సోమ అమావాస్య రా.గ 3.53 వ
తే 2 మంగళ పాడ్యమి పూర్తిగ
తే 3 బుధ విదియ పూర్తిగ
తే 4 గురు విదియ ఉ.గ. 8.00 వ
తే 5 శుక్ర తదియ ఉ.గ. 9.53 వ

స్వయంపాకుల శ్రీనివాసులు, ఎం.ఎ.

జనవాణి

3 పేజీ కొరవ

పాఠాలు నేర్చుకొన్నందుకు నాకు గర్వంగా వుంది. తిరిగిరాని లోకాలకు వెళ్లిన గురువు గారికి నా ప్రగాఢ శ్రద్ధాంజలి.

చెర్లోపాళెం వి. నిరంజన్

చంద్రబాబు ఢిల్లీ ప్రయాణాలు!

ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఈ మధ్య ఢిల్లీ రాజకీయాల్లో మునిగి తేలుతూ వారానికి మూడు రోజుల అక్కడే ఉంటున్నారు. ఆయన ప్రయాణానికి, బస ఏర్పాట్లకు రాష్ట్ర ప్రభుత్వంపై ఎంతో అదనపు భారం పడుతుంది. దీనికి బదులు ఆయన అక్కడే వుండి, కంప్యూటర్ సమాచారాలతో ప్రభుత్వాన్ని నడిపిస్తే బాగుంటుంది. పూర్వం ప్రతిపక్షంలో చంద్రబాబు నాయుడు వుండే సమయంలో కాంగ్రెస్ ముఖ్య మంత్రులు, అధిష్టాన వర్గాన్ని కలిసే విషయాన్ని వెలిత్తి చూపేవారు. ఇప్పుడు ఆయన చేస్తున్న దేమిటో అర్థం కావడం లేదు. జనార్ధన రెడ్డి ముఖ్య మంత్రిగా ఉండగా రెండు రూపాయల కిలో బియ్యాన్ని 3.50 చేస్తే చంద్రబాబు పెద్ద రచ్చ చేసారు. కానీ ఆయన ముఖ్యమంత్రి అయ్యాక బియ్యం కోటా తగ్గించి పేదల బోళ్లు కొట్టారు. విద్యుత్ బోర్డును ప్రైవేటీకరణ చేస్తే యూనిట్ విద్యుత్ ధర్లో 4 రూపాయలు కావడం భారం.

ఇది జరిగితే ఏ రైతూ ఇక రాష్ట్రంలో వ్యవసాయం చేయలేడు. సమస్యలకు మసి పూసి మారేడుకాయ చేసి ప్రజలను మభ్యపెట్టడంలో చంద్రబాబు ఘనాపాటి. ఈ మోసం ఎల్లకాలం కొనసాగదు.

గంగవరం జి. రామకృష్ణప్రసాద్

ఆక్రమణలు తొలగిస్తారా?

నెల్లూరు టౌన్‌లోని దురాక్రమణలను అధికారులు తొలగిస్తారని 'జమీన్‌రైతు'లో వ్రాస్తూ అధికార్లకు అన్ని దమ్ములున్నాయా? అని ప్రశ్నించారు. ఇది అక్షరాలా నిజం. ఇంత వరకు ఆక్రమణ దారులకు నోటీసులు గాని తొలగించడం గాని జరగలేదు. విజిలెన్స్ అధికారులు ఇటీవల అపార్ట్ మెంట్స్, రియల్ ఎస్టేట్స్ వారి వద్ద నుంచి నిబంధన లంటూ డబ్బులు గుంజుకొన్నట్లు, ఆక్రమణల పేరుతో ఇంకొందరు అధికారులు బాగుపడడానికి ఈ ప్రయత్నం చేస్తున్నట్లుంది. మునిసిపల్, పోలీస్, రెవిన్యూ అధికార్లు ఆక్రమణల బూచిని చూపించి ప్రజలను దోచుకొంటే ఆపేదెవరు? ఐదుశాఖల మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి ఆక్రమణల తొలగింపు విషయంలో పట్టుదలగా వున్నట్లున్నారు. టౌన్‌లోని వివిధ బస్టాపుల వద్ద ఆక్రమణలు ప్రయాణీకులను చికాకు పెడుతున్నాయి. వీటి విషయమై అధికారులు శ్రద్ధ వహించాలి.

నెల్లూరు ఎ. సాయిరాం

ప్రజా ప్రతినిధుల దివాళాకోరుతనం

ఎమ్మెల్యేలు, ఎమ్పీలు ప్రజా సమస్యలు పరిష్కరించడంలో శ్రద్ధ చూపించక పోయినా, తమ సౌకర్యాలు మెరుగు పరచు కోవడంలో విశేష కృషి చేస్తున్నారు. రాష్ట్రంలోని ఎమ్మెల్యేలకు ఈ మధ్య జీతాలు పెరిగాయి. కార్లు కొనుక్కొనేందుకు లోన్లు ఇవ్వడంతో పాటు, నివాసానికి భాగ్య నగరంలో ప్లాట్లు కూడా ఇచ్చారు. పార్లమెంటు సభ్యులకు జీతాలను కొత్త ప్రధాన మంత్రి చాలా పెద్ద మొత్తంలో పెంచు తున్నారు. ఇంతకు మునుపు ప్రధాని దేవగౌడ ఎమ్పీల కోటాగా ప్రత్యేకించి వుండే గ్యాస్, టెలిఫోన్ కనెక్షన్ల పరిమితిని బాగా తగ్గించి పారేశారు. ఈ విషయం ఎమ్పీలను చాలా బాధ పెట్టినట్లుంది. గుజ్రాల్ ప్రధాని అయ్యాక వంద మంది ఎమ్పీలు కలసికట్టుగా ఆయన్ను కలిసి తమ కోటాలను తిరిగి పునరుద్ధరించ మన్నారట. ఈ విధంగా అడుక్కోవడం వారికి సిగ్గనిపించ లేదేమో? ప్రజా సేవాతత్పరత గల ప్రతినిధులకు వందలాది గ్యాస్, టెలిఫోన్ కనెక్షన్లు ఎందుకో అర్థం కావడం లేదు.

గూడూరు ఎస్. యానాదయ్య

యాభైఏళ్లక్రితం

3 వ పేజీ కొరవ

మహారాజశ్రీ రాజమాన్య రాజపూజితులైన రావుసాహెబ్ చుండూరు సుబ్బయ్య శెట్టి గారు మాత్రం యింత వరకు తమ బిరుదాన్ని వదులు కోలేదు. వదులు కోవలసినట్టు ప్రభుత్వ ఉత్తర్వు ఏమీ లేదట. సన్నద్ మీద సంతకం చేసిన వేవెల్ ప్రభువుకు కేబిల్ యిచ్చి ఆయన గనక వదులు కోమంటే వదులు కుంటాడని ఆయన మిత్రు లంటున్నారు.

జడ్డి మార్పు

జిల్లా జడ్డి పిఎస్ రామస్వామి గారు సెలవు మీద పోయినారు. వెనక మేము సూచించినట్లు వైశ్యాత్రీ వై. సుబ్బారావు గారు వచ్చి 25 తేది చార్జి తీసుకొన్నారు. సంపూర్ణ విగ్రహం – నిండు కుండగా కనబడు చున్నది. రుచి చూచిన తర్వాత –

నీతిమట్టం

26 తేది లెక్క ప్రకారం – ఆనకట్ట మీద 3 అడుగులు; పెద్ద తూము పారుదల 2560 కుంట అడుగులు; నెల్లూరు చెరువు 12.20 అడుగులు; సర్వేపల్లి చెరువు 4.75 అడుగులు; కలిగిరి చెరువు 18.60 అడుగులు.

జిల్లావార్తలు

7 వ పేజీ కొరవ

ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి వచ్చి వాజపేయి 13 సంవత్సరాలు దేశాన్ని పరిపాలిస్తారని వెంకయ్య నాయుడు చెప్పారు.

కొత్త ఓటర్లు పేర్లు నమోదు చేసుకోండి

1998 జనవరి 1 తేది నాటికి 18 సంవత్సరాలు నిండే యువతీ యువకులు ఓటర్ల లిస్టులో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సాంబశివరావు కోరుతున్నారు. అర్హత గల్గిన ప్రతి ఒక్కరు ఎమ్మార్వో ఆఫీసు కార్యాలయాల్లో సెప్టెంబరు 15 తేది నుంచి, అక్టోబర్ 14తేది వరకు ఫారం నెం.6లో పూర్తి వివరాలు వ్రాసి దరఖాస్తు చేసుకోవాలి. చేర్పులు, తొలగింపులు, పరిష్కారాలు నవంబరు 15 తేది జరుగుతాయి. ఓటర్ల లిస్టు పరిశీలించుకొనేందుకు, నమూనా ఓటర్ల జాబితాలు సెప్టెంబరు 15 తేది నుంచి ఎమ్మార్వో ఆఫీసు కార్యాలయాల్లో అందుబాటులో వుంటాయి. తుది జాబితాల ప్రచురణ జనవరి 5 తేది జరుగుతుందని; ఈ అవకాశాన్ని ఉపయోగించుకోమని కలెక్టర్ తెలియజేస్తున్నారు.

జమీన్‌రైతు

సంవత్సర చందా	రూ. 100/-
ఆరు నెలలకు	రూ. 50/-
ప్రతిప్రతి	రూ. 2/-

విప్లవం నావంటికి సరిపడదు!

తాను విప్లవ చిత్రాలు తీయలేనని యువదర్శకుడు ఇవివి సత్యనారాయణ కుండబద్దలు కొట్టినట్లు చెప్పేశారు. ఈ తరహా చిత్రాలు విజయవంత మవుతున్న తరుణంలో తనని ఇటువంటి చిత్రాలకు కూడా దర్శకత్వం చేయమని కొందరు అడుగుతున్నారట. కాని నేను చల్లని గోదావరి నీళ్లు తాగినోడ్ని; వెచ్చటి నెత్తుటి వేడితో కూడిన సబ్జెక్ట్ ఉండే సినిమాలు తీయలేను. సబ్జెక్టు గూర్చి తెలియకుండా ఎవరినో ఒకరిని పక్కన పెట్టుకొని సలహాలు తీసుకొని సినిమా చేయడమంటే నేను అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నానని పిస్తుందని అన్నారు.

ఎన్టీఆర్ చిన్న కుమారుడి వివాహం

ఎన్టీరామారావు చిన్న కుమారుడు జయశంకరకృష్ణ వివాహం 14 తేది తిరుమలలో వైభవంగా జరిగింది. స్వర్గీయ ఎన్టీరామారావు దంపతుల ఫోటోల సాక్షిగా ఈ వివాహాన్ని ఆయన కుమారులు, కుమార్తెలు జరిపించారు. పెళ్లికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరు కాలేకపోయినా, 18 తేది హైదరాబాద్‌లో జరిగిన రిసెప్షన్‌కు వచ్చి వాలాసేపు గడిపారు.



రుక్మిణి చిత్రంలో వినీత్, ప్రీతి

అవార్డులు వద్దనను: అక్కినేని

మాటింగుల కవరేజి కోసం అన్నపూర్ణ స్టూడియోలో ఉండగా, అక్కినేని నాగేశ్వరరావు అక్కడకు రావడం, రెండు నిమిషాలు మాట్లాడడం జరిగింది. దాదా సాహెబ్ ఫాల్కే వంటి ప్రతిష్టాత్మక అవార్డు తీసుకొన్న తరువాత కూడా ఎందుకు మీరు చిన్న, చితక అవార్డులకు ఒప్పుకొంటున్నారు? యంగ్ హీరోలకు అవకాశం కల్పించడం కోసం అవార్డులు తీసుకోను అని ప్రకటించవచ్చు కదా... అన్నాను. దీనికి అక్కినేని బాగా స్పందించారు. 'నో' - అవార్డులు నేను వద్దనను; అవార్డు చిన్నదీ, పెద్దదీ అనే తేడా నాకులేదు; అవార్డు అంటే అవార్డే; ఎవరి కోసమో నేను నాకు రావాల్సిన అవార్డును వద్దనలేను? అది వట్టి పనికిమాలిన తనం. 'ఈ వయసులో కూడా నాగేశ్వరరావు మనతో పరుగు పందెంలో నిలిచి అవార్డు కొట్టాడు' అనే ఇన్‌స్పిరేషన్ యువతరం నటులలో రావాలి. అంతేగాని ఏయన్నార్ అవార్డ్ వదిలేస్తే మనం కొట్టేద్దాం అన్న ఆలోచన వారిలో రాకూడదని చెప్పారాయన.

క్రాంతిపై లైలాకు పెద్ద ఆశలు

మహిళా సమస్యలపై చక్కని చిత్రాలు తీసి పేరు గడించిన దర్శకుడు క్రాంతి కుమార్ ఎగిరే పావురమా ఫేమ్ లైలాతో, ఒక డిఫరెంట్ సబ్జెక్ట్‌తో సినిమా తీయను ప్లాన్ వేసుకొన్నాడు. ఈ చిత్రంపై లైలా పెద్ద ఆశలు పెట్టుకొని ఉంది.

రజనీకాంత్ తదుపరి చిత్రం

రజనీకాంత్‌కు తమిళనాడులో ఉన్న ఫాలోయింగ్ మరొకరికి లేదనే చెప్పాలి. ఆయనేది చేసిన పెద్ద వార్తే. అరుణాచలం చిత్రం తర్వాత ఎవరి సినిమాను ఒప్పుకొంటారా అని ఆయన అభిమానులు చాలా రోజులుగా ఎదురు చూస్తున్నారు. ఈ దశలో ఈ మధ్య కాసింత దెబ్బతినిడున్న మణిరత్నంతీసే తదుపరి సినిమాలో నటించడానికి రజనీకాంత్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. 'ఇద్దరు' సినిమా కొట్టిన ఎదురుదెబ్బతో ఎనేజాగ్రత్తలు తీసుకొని, మణిరత్నం చక్కని కథను తయారుచేసి రజనీని ఒప్పించారట.

నాన్నతో సరితూగానని నాగార్జున ఆనందం!

అన్నమయ్య చిత్రం విజయం సాధించడంతో నాగార్జున చాలా హుషారుగా వున్నాడు. మా నాన్నగారు చాలా గొప్ప చిత్రాల్లో నటించారు. ఆయన కుమారుడిగా కొద్దోగొప్పో నటనతో ఆయన సరసన చేసే ఒక్క చిత్రంలో నైనా నటించగలనా అన్న 'ఇన్నర్ ఫీలింగ్' ఉండేది. అన్నమయ్య చిత్రం ఆ ఫీలింగ్‌ను పోగొట్టిందని ఆనందంగా చెప్పాడు.

చిరంజీవి జన్మదినం ప్రత్యేకలు

మెగాస్టార్ అని అభిమానులు కీర్తించే చిరంజీవి తన జన్మదినాన్ని ఆగష్టు 22 తేది హైదరాబాద్‌లో మూలనిధితో చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్ ప్రారంభిస్తున్నానని, ఈ ట్రస్ట్ నేతృత్వంలో అంతర్జాతీయ ప్రమాణాలతో హైదరాబాద్‌లో బ్లడ్ బ్యాంక్ స్థాపిస్తామని ప్రకటించారు. తన అభిమానులురక్తదానం వంటి ప్రయోజనకరమైన కార్యక్రమాలు చేయాలని పిలుపిచ్చారు.

ఈశ్వర అల్లా చిత్రం ప్రారంభం

సాయికుమార్ హీరోగా ఆయన సోదరుడు అయ్యప్ప పి.జె. శర్మ దర్శక, నిర్మాతగా తీస్తున్న ఈశ్వరఅల్లా చిత్రం పాటల రికార్డింగ్ మద్రాసులో ప్రారంభమయ్యింది. సాయికుమార్ తండ్రి పి.జె. శర్మ ఈ చిత్రానికి సమర్పకుడు. పరుచూరి బ్రదర్స్ సంభాషణలు సమకూర్చే చిత్రానికి పాటలు వేటూరి, సీతారామశాస్త్రి, గురుచరణ్ వ్రాస్తున్నారు. సంగీతం: కోటి. కెమరా: భీటా కె. నాయుడు. అయ్యప్ప పి.జె. శర్మ ఇంతకు మునుపు కన్నడంలో ఒక చిత్రానికి దర్శకత్వ బాధ్యతలు నెరిపాడు. ఆ చిత్రం బాగా ఆడడంతో అది ఉత్సాహంతో తెలుగు చిత్రానికి దర్శకత్వ బాధ్యతలు చేపట్టినట్లు సాయికుమార్ చెప్పాడు.

మద్రాసు సినిమా వార్తలు

ఘనంగా జరుపుకొన్నారు. జన్మదినం నాడే హైదరాబాద్ జూబ్లీ హిల్స్ చెక్‌పోస్ట్ పద్ద కొత్తగా కట్టిన ఇంటిలో ప్రవేశించారు. ఈ సందర్భంగా నారాయణగూడ వై.ఎం.సి.ఎ గ్రౌండ్‌లో రెండువేల మంది అభిమానులతో కలిసి రక్తదానం చేశారు. 60 మంది వికలాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. '25 లక్షల

ఉగ్రవాదాన్ని సమర్థించి, పోలీసులను విమర్శించిన

ఎన్‌కౌంటర్

నక్సల్స్ నేపథ్యంలో "ఎన్‌కౌంటర్" చిత్రం నిర్మించ బడింది. ఈ చిత్రం, ఉగ్రవాదాన్ని సమర్థించింది. దానవత్వాన్ని అనుసరించే పోలీసు అధికారుల కన్నా, ఉగ్రవాదులే మనసున్న మనుషులని, మానవత్వాన్ని గుర్తించిన ఒక పోలీసు అధికారి చేత చెప్పించింది. పోలీసు వ్యవస్థను అడ్డు పెట్టుకొని బడుగు వర్గాలను కడగండ్ల పాలుచేసే నల్లదొరల నిరంకు శత్వాన్ని నిరసించింది. విచక్షణా రహితంగా జరిపే ఎన్‌కౌంటర్లను ఖండించింది. దేశ రక్షణకు, సమాజ సంక్షేమానికి అండగా నిలువ పలసిన పోలీసు వ్యవస్థ అందుకు విరుద్ధంగా వ్యవహరించే తీరుతెన్నులను సమగ్రంగా చర్చించి, విమర్శించింది. ఉగ్రవాదం మీద నిజాయితీ పరుడైన ఒక పోలీసు అధికారికి, ఒక ఉగ్రవాదికి మధ్య సుదీర్ఘమైన వాదోప వాదాన్ని వినిపించింది. డాక్టర్లు, ఇంజనీర్లు, లెక్చరర్ల వంటి విద్యాధికులు తుపాకులు చేతబట్టి, అడవులకు వెళ్లవలసిన పరిస్థితులు ఎందుకు ఏర్పడు తున్నాయన్న విషయాన్ని కూలంకషంగా దృశ్యరూపంలో చూపింది. విజృంభణలో వున్న ఫ్యూడలిజం, పెట్టుబడిదారీ విధానం వేధింపులను భరించలేక తుది నిర్ణయంగా తుపాకి పట్టి అడవుల్లో కాలుపెట్టిన అన్నలు, అక్కలు - పోలీసు హింసాకాండకు గురయ్యే అమాయకుల రక్షణకు నల్లదొరల కొమ్ముకాస్తూ అమాయకులను హతమార్చే పోలీసు అధికారులను ఒక బుల్లెట్‌తో కాల్చి చంపితే తృప్తి తీరదని, అటువంటి రాక్షస అధికారులను చిత్రహింస చేసి అంత మొందించి కసి తీర్చుకోవాలని కక్ష సాధింపు చర్యను జ్వలింప జేసింది. దేశ స్వాతంత్ర్యం కోసం ఆనాడు తెల్లదొరలతో పోరాడిన అల్లూరి సీతారామ రాజు, భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్ వంటి విప్లవ వీరులను స్వాతంత్ర్యం సాధించిన తర్వాత అమర వీరులుగా ప్రజలు ఎలా కీర్తిస్తున్నారో; పోలీసు దురాగతాల నుండి, నల్లదొరల నిరంకుశత్వం నుండి, అమాయకులను అమాయకుల రక్షణకు అండగా నిలుస్తాడు. కథానాయిక, విద్యాధికురాలైన స్వర్ణక్క (రోజా) ప్రజలకు సేవ చెయ్యాలన్న దృక్పథంతో ఒక దళాన్ని నడుపు తుంది. ఆమెకు ఉగ్రవాద నాయకురాలు అనే రంగు పులుముతారు పోలీసులు. తన తల్లి (రాధిక) ఆశయం మేరకు పల్లెప్రజలకు వైద్యసేవ చెయ్యాలన్న పట్టుదలతో సూర్యం (రమేష్) మెడిసిన్ చదువు తుంటాడు. పోలీసు కాల్పుల్లో గాయపడ్డ స్వర్ణక్క సూర్యం వున్న హాస్టల్ గదిలో తలదాచు కుంటుంది. అతని గది నుంచి తిరిగి వస్తున్న స్వర్ణక్కను పోలీసులు చుట్టు ముట్టి చంపేస్తారు. స్వర్ణక్కకు ఆశ్రయ మిచ్చాడన్న నెపంతో అమాయకుడైన సూర్యాన్ని తీవ్రవాదిగా చిత్రించి జైల్లో బంధించి, హింసిస్తారు.

ఎస్పీ సిద్ధార్థ (వినోద్ కుమార్) మొదట్లో ఉగ్రవాదాన్ని కూకటి వేళ్ళతో పెకలించి పారెయ్యాలను కుంటాడు. కాని తన పోలీసు అధికారుల్లో కొందరు సాగిస్తున్న బూటకపు ఎన్‌కౌంటర్లను, వారు చేసే ఘోరాలను చూచి వారిని నిలదీస్తాడు. ఎస్పి అడ్డు తొలగించు కొనేందుకు ఒక పోలీసు అధికారి అతడ్ని హత్య చెయ్య బోతాడు. ఆ పోలీసు అధికారిని కృష్ణన్న కాల్చిచంపి ఎస్పిని రక్షిస్తాడు. ఆ సంఘటన తర్వాత ఎస్పి ఉగ్రవాదులే మనసున్న మనుషులుగా భావించి, పోలీసు అధికారుల మీద, నల్లదొరల

చిత్రసమీక్ష

***

గిద్దలూరు గోపాలరావు

రక్షించటంలో అసువులు బాసే ఉగ్రవాదులను కూడా సమసమాజ స్థాపన తర్వాత అమర వీరులుగా కీర్తిస్తారని ఆశించింది. అర్థశతాబ్దపు స్వతంత్ర భారతం సాధించిం దేమిటి అని ఘాటుగా ప్రశ్నించింది.

ఈ ప్రశ్నకు సరైన సమాధానం తెలుసుకొన్న ఈ చిత్రంలోని కథానాయకుడు కృష్ణన్న (కృష్ణ) తుపాకి పట్టిన అన్నగా అమాయకులను బలిగొనే పోలీసుల మీద, నల్లదొరల

నెల్లూరు సంగతులు

4 పేజీ తరువ

చెప్పారు. 5,206 మంది ఎముకలలో అంగవైకల్యం;2,292 మంది చెవి, ముక్కు, గొంతులలో వైకల్యం;720 మంది కంటి లోపం గలవారికి ధృవీకరణ పత్రాలిచ్చారట. 1,258 మందికి బస్ పాస్, 223 మందికి రైల్వే పాస్‌లు ఇవ్వమని సిఫార్సు చేసినట్లు వివరించారు. 27 తేది కల్లా గ్రామాల్లోని వివిటలు సంబంధిత వ్యక్తులకు ఈ పత్రాలు అందజేస్తారని కలెక్టర్ తెలియ జేస్తున్నారు.

వెనుకబడిన తరగతుల సమాఖ్య కార్యవర్గం

నెల్లూరు జిల్లా వెనుకబడిన తరగతుల సమాఖ్య సర్వసభ్య సమావేశం 24 తేది విఆర్ కాలేజిలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యవర్గ ఎన్నికల్లో గౌరవాధ్యక్షుడిగా శ్రీ మంకు వెంకటేశ్వర్లును ఎన్నుకొన్నారు. అధ్యక్షునిగా బి. ముక్కంటిరాజు, ప్రధాన కార్యదర్శిగా టి. బ్రహ్మయ్య, ఉపాధ్యక్షులుగా పుట్టు రాఘవులు, నాయుడు రాంప్రసాద్, మల్లి పెంచలయ్య, కె. గోవిందయ్య, కార్యదర్శులుగా పి. మస్తాన్ బాబు, పి. సుబ్రహ్మణ్యం, ఎన్. చెన్నకేశవులు రావు, సిహెచ్ కోటి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఉడతా మణియాదవ్, ప్రచార కార్యదర్శిగా సిహెచ్ శ్రీధర్, కోశాధికారిగా ఎం. వెంకట రమణయ్యలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఎన్నికల అధికారిగా ఎం. వెంకటాద్రి వ్యవహరించారు.

బిసిలకు ఉచిత శిక్షణ

జిల్లాలోని వెనుకబడిన తరగతుల్లోని నిరుద్యోగ యువతీ, యువకులకు బిసి సంక్షేమ శాఖ ఉచితంగా కంప్యూటర్‌లో డేటా ఎంట్రీ, స్టెనోగ్రాఫీల్లో శిక్షణ ఇప్పిస్తుంది. ఇంటర్మీడియట్ పాస్, 18-34 మధ్య వయస్సు గలవారు దరఖాస్తు చేయవచ్చు. 9 నెలల శిక్షణా కాలంలో నెలకు 250 రూపాయల ఉపకార వేతనం కూడా ఇస్తారు. బిసి కార్పొరేషన్ నుంచి దరఖాస్తులు పొంది సెప్టెంబర్ 9 లోగా భర్తీ చేసి; వాటిని అదే ఆఫీసులో అందజేయాలని సంక్షేమాధికారి తెలియ జేస్తున్నారు.

పత్తి సుబ్బారావుకు సన్మానం

నెల్లూరు జిల్లా రైల్వే యూజర్స్ అసోసియేషన్ - స్వాతంత్ర్య సమరయోధుడు, సీనియర్ జర్నలిస్ట్ పత్తి వెంకట సుబ్బారావును 24 తేది సన్మానించింది. సర్వోదయా కాన్వెంట్‌లో ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో రైల్వే యూజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యిన్నమూరి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ తమ అసోసియేషన్‌ను 39 సంవత్సరాల క్రితం సుబ్బారావు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైల్వే స్టేషన్ తూర్పు వైపు ఫుట్ ఓవర్ బ్రిడ్జి, బుకింగ్ ఆఫీసును వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. సభలో జిఆర్ కృష్ణమూర్తి, వొమ్మిన సుబ్రహ్మణ్యం, జెవికె బాబు, ఎం. ధర్మారెడ్డి, జితేంద్ర నాథ్‌బాబు, పి. పార్థసారధి పాల్గొని ప్రసంగించారు.

ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గాలయ్య

ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కె. గాలయ్య అభినందన సభ 21 తేది నెల్లూరులో జరిగింది. ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస రావు మాట్లాడుతూ 1963 నుండి జిల్లా అధ్యక్షుడిగా గాలయ్య చేసిన సేవలను గుర్తించి, రాష్ట్ర యూనిట్ ఉపాధ్యక్షుడిగా ప్రమోట్ చేసినట్లు చెప్పారు. సమావేశంలో ఉపాధ్యాయ నాయకులు పి. సుధాకర రెడ్డి, వి. ప్రభాకర రెడ్డి, టి. శ్రీనివాస రావు, బుద్ధయ్య, కృష్ణారెడ్డి, తిరుపతి రెడ్డి పాల్గొని మాట్లాడారు.

గణేష్ మహోత్సవం

వేదాయపాళెం గణేష్ ఉత్సవ కమిటి నేతృత్వంలో వినాయక చవితి వేడుకలు సెప్టెంబరు 5, 6, 7 తేదుల్లో జరుగ నున్నాయి. 5 తేది విగ్రహ ప్రతిష్ట, సాయంత్రం ఉట్టి మహోత్సవం, 6 తేది పాటకచ్చేరి, 7 తేది నిమజ్జన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

దాతలు సహాయపడండి

నెల్లూరుకు చెందిన ఇంజనీరింగ్ చదివే యువకుడు ఎన్. రామప్రభు ఐటివల అత్యంత వ్యయప్రయాసలతో చెడిపోయిన రెండు కిడ్నీల స్థానంలో, కొత్తవాటిని అమర్చుకొన్నాడు. ఆపరేషన్ తరువాత నెలసరి మందులకు గాను 8వేల రూపాయలు ఖర్చవుతున్నదట. మధ్య తరగతి కుటుంబానికి చెందిన ఈ యువకుడు ఆ ఖర్చు భరించలేని స్థితిలో బాధపడుతున్నాడు. హృదయమున్న దాతలు ఎన్. రామప్రభు, బిస్మిల్లా మంజిల్, లిటిల్‌ఫ్లవర్ స్కూలు ఎదురుగా, వేదాయపాళెం, నెల్లూరు - 4 చిరునామాకు, తమకు తోచిన విరాళాలు పంపి సహాయపడమని అభ్యర్థిస్తున్నాడు.



నెల్లూరు ట్రంకు రోడ్‌లో వరల్డ్ ఆఫ్ టైటాన్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న టైటాన్ ఇండస్ట్రీస్ వైస్ ప్రెసిడెంట్ బిజూ కురియన్, జనరల్ మేనేజర్ మనోజ్ చక్రవర్తి, షోరూమ్ అధినేత సోమశేఖర రెడ్డి


చిత్రసమీక్ష

9 వ పేజీ కొరవ

దర్శకుడు ఎన్. శంకర్ ఈ కథ వ్రాశాడు. ఇలాంటి ఇతివృత్తంతో ఇది వరకు చాలా చిత్రాలు వచ్చాయి. కాని దర్శకుడు శంకర్ ఈ చిత్రంలోని దృశ్యాలకు కొత్తదనం చేకూర్చాడు. ముఖ్యమైన కృష్ణన్న, స్వర్ణక్క, ఎస్‌పి సిద్ధార్థ, సూర్యం పాత్రలను చక్కగా తీర్చిదిద్దాడు. దుర్మార్గులైన పోలీసు అధికారులను, నల్లదొరలైన రాష్ట్ర మంత్రులు వగైరాలను కృష్ణన్న కసిదీరా చితక గొట్టిన దృశ్యాలు ప్రేక్షకులను తృప్తి పరిచాయి. స్వర్ణక్కను మట్టుబెట్టిన తర్వాత ఆమె తండ్రి (కాకరాల) ప్రజల మధ్య నిలబడి ఘోషించిన తీరు, పట్టును చేకూర్చింది. తన శక్తి సామర్థ్యాలతో చిత్రాన్ని ఒక చైతన్యశక్తిగా మలిచాడు దర్శకుడు.

హరనాథ రావు మాటలు బాగా ఆకట్టు కున్నాయి. పాటలన్నీ విప్లవ సాహిత్యంతో నిండుకొని వున్నాయి. విప్లవ చిత్రాల సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ సంగీతం కూర్చాడు. "ఎనకొచ్చే ఆవుల్లారా" "వూరు వాడా అక్కల్లారా ఉత్తర మొచ్చిందే" – తెలంగాణా పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించే ఈ రెండు పాటలు మరలా మరలా వినతగ్గవి. వారి అనుమోలు ఫోటోగ్రఫీ బాగుంది.

మీద పోరాటం సాగించి పోలీసుల చేతుల్లో మరణిస్తాడు. రెచ్చిపోయిన కృష్ణన్న పోలీసు మూకను చీల్చి చెండాడుతాడు. దుష్టుడైన రాష్ట్ర మంత్రిని (కోట శ్రీనివాస రావు) మట్టు బెట్టాడు. చివరన తన అనుచరులను, అమాయకులను రక్షించటంలో పోలీసు బుల్లెట్లకు కృష్ణన్న బలైపోతాడు.



ఇందిరా భవన్‌లో ఇందిరమ్మ విగ్రహానికి పూలమాలవేసి, ప్రణామాలర్పిస్తున్న మాజీముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి, పివికానందరెడ్డి, నివి. శేషారెడ్డి

జమిన్‌రైతు

సంవత్సర చందా	రూ. 100/-
ఆరు నెలలకు	రూ. 50/-
విడిప్రతి	రూ. 2/-

సిమెంటు రంగంలో రారాజు

ప్రియా సిమెంట్

ప్రియదర్శిని సిమెంట్ లిమిటెడ్ వారి ఉత్పాదన